


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 59 | శనివారం 28 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## డోన్ సమీపంలో ఘోర ప్రమాదం

### కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం

నంద్యాల,ఫిబ్రవరి27 :నంద్యాల జిల్లా డోన్ సమీపంలో బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. కారు, క్రేన్ ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటకకు చెందిన ప్రమోద్ తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్తుండగా.. జగదూతి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న క్రేన్ ఢీ కొట్టింది.




ఢిల్లీ మద్యం కేసులో అభియోగాలే తప్ప ఆధారాలేవీ
కేసును కొట్టివేస్తూ సిబిఐపై కోర్టు తీవ్ర వ్యాఖ్యలు
ఆధారాలు లేకుండా కేసు నడిపారని మండిపాటు
హైకోర్టులో సవాల్ చేస్తామని సిబిఐ వెల్లడి


## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో

# కవితకు క్లీన్ చిట్

2లో

### కేజ్రీవాల, సిసోడియా, కవితలపై కేసు కొట్టివేత

## ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం



ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు

2లో

## ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ..

### నారా లోకేశ్ చేతులమీదుగా శంకుస్థాపన

రాంబిల్లి సెజ్‌లో బ్లూ జెట్ హెల్త్‌కేర్ రూ.2,300 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ
ఈ ప్రాజెక్టు ద్వారా 1,750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు
మొత్తం 102.48 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికల్లో భాగంగా మరో భారీ పరిశ్రమ ఏర్పాటవుతోంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (బీజేహెచ్ఎల్) తన తయారీ యూనిట్‌ను



2లో

## ఏపీకి మరో భారీ పరిశ్రమ.



ఏపీకి రానున్న దేశంలోనే తొలి అమోర్ఫోస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్
తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1350 కోట్ల పెట్టుబడి
అమెరికా-జపాన్ సంయుక్త సంస్థ ప్రొటెరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
2026 అక్టోబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం లక్ష్యం
ఈ ప్రాజెక్టుతో సుమారు 200 మందికి ప్రత్యక్ష ఉపాధి

2లో

## దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

కేటాయించిన స్థలంలోనే చెత్త వేసేలా అవగాహన
హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు
అవసరమైతే కిచన్‌లలో సిసి కెమెరాల ఏర్పాటుతో పరిశీలన
మున్సిపల్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు



2లో



## కన్నీరు పెట్టుకున్న కేజ్రీవాల్

2లో

మోడీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా
నేను నిర్దోషినని కోర్టు నిరూపించంది
నన్ను దొంగగా చిత్రీకరించి ప్రచారం చేశారు
కోర్టు తీర్పుతో ఉద్వేగానికి లోనైన కేజ్రీవాల్

### బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను: పవన్ కల్యాణ్



బొత్స త్వరగా కోలుకోవాలన్న పవన్ కల్యాణ్
ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన
ఓ ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం

2లో

## ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా మృతి చెందారని వెల్లడి
గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్

2లో



ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ

## లొంగిన మావోయిస్టులకు అండ

### రివార్డులు త్వరగా అందచేస్తాం

### లొంగిన నేతలతో సిఎం రేవంత్ భేటీ



2లో

## నటుడు సంజయ్‌తో లోకేశ్ భేటీ



2లో

ఆంధప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాలీవుడ్ ప్రముఖ నటుడు సంజయ్ దత్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితకు క్లీన్ చిట్

ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది.

ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు.

అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది.

సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

# ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**2029 నాటికి అందరికీ ఇళ్లు** రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

**అక్రమార్కులపై ఉక్కుపాదం** గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

**వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

**రాయలసీమ ఇక ఉద్యాన హబ్** రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు. నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

## ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్

అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు. గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు కోరుకోవడం లేదని, మరిన్ని ప్రాణాలు పోకముందే మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని జగన్ పేర్కొన్నారు.

## ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ..

ఏర్పాటు చేయనుంది. రూ.2,300 కోట్ల భారీ పెట్టుబడితో రానున్న ఈ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (ఫిబ్రవరి 28) శంకుస్థాపన చేయనున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న బ్లూ జెట్ హెల్త్‌కేర్, శాస్త్ర ఆధారిత ప్రత్యేక ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీలో జాతీయ స్థాయిలో మంచి పేరున్న సంస్థ. ఈ సంస్థ రాంబిల్లి సెజ్‌లో ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, జడ్.చింతువ రెవెన్యూ పరిధిలోని సీతపాలెం వద్ద 102.48 ఎకరాల భూమిని కేటాయించింది. ఎకరాకు రూ.40 లక్షల చొప్పున భూమిని కేటాయించడంతో పాటు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అదనపు ప్రోత్సాహకాలను కూడా మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సంస్థ మొత్తం రూ.2,300 కోట్ల పెట్టుబడిని దశల వారీగా పెట్టనుంది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1,750 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని బ్లూ జెట్ హెల్త్‌కేర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ పెట్టుబడి రాకతో స్థానిక పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. అంతేకాకుండా, ప్రధాన పరిశ్రమకు అనుబంధంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటై పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధునాతన ఫార్మాస్యూటికల్ తయారీ రంగంలో ఒక కీలక గమ్యస్థానంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



## లొంగిన మావోయిస్టులకు అండ

మావోయిస్టుల అగ్రనేతలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ క్రమంలో మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని పలకరించారాయన. మావోయిస్టుల పునరావాసంపై హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావో నేతలపై ఉన్న రివార్డును వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. అలాగే , లొంగిపోయిన మావోయిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోవ టానికి చొరవ చూపిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కి మావోయిస్ట్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. చట్టప్రకారం పునరావాసం, రక్షణ పరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మావోయిస్టుల లొంగుబాటుపై తెలంగాణ అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలిపారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించారు.

## రచ్చకెక్కిన విజయ్ వ్యక్తిగత జీవితం

తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. ఆయన భార్య సంగీత సంచలన ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందటే తాము మానసికంగా విడిపోయామని విజయ్ భార్య సంగీత అన్నారు. విజయ్‌కి ఓ నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఆ నటితో విదేశాలకు, పార్టీలకు విజయ్ వెళ్తారని చెప్పుకొచ్చారు. విజయ్ తనను వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇది ఇలాగే కొనసాగితే ఆ నటి పేరు బయటపెడతానంటూ సంగీత హెచ్చరించారు. వివాహేతర సంబంధం ఓ ద్రోహమని సంగీత ఫైర్ అయ్యారు. విజయ్ వివాహేతర సంబంధం గురించి 2021లో తెలిసిందని అన్నారు. ఆ నటితో సంబంధం తెంచుకుంటానని విజయ్ తనతో చెప్పారని ప్రస్తావించారు. మాట తప్పి ఆ సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పదేపదే తమ మధ్య విభేదాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఆ నటికి మద్దతుగా విజయ్ మాట్లాడుతూ వచ్చారని.. ఆయన నిర్లక్ష్యం కారణంగా తాను ఒంటరినయ్యానని సంగీత పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన భార్య సంగీత చెంగల్‌పట్టు కుటుంబ న్యాయస్థానంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివాహ జీవితం సజావుగా కొనసాగడం లేదని, వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌ను స్వీకరించగా.. ఏప్రిల్ 20వ తేదీన కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. సంగీత లండన్‌కు చెందిన తమిళ కుటుంబానికి చెందినవారు. విజయ్ నటుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన అభిమానిగా సంగీత పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. కుటుంబ సభ్యుల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, వివాహమైన కొంతకాలం తర్వాతే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ప్రారంభమైనట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారని సినీవర్గాల్లో ప్రచారం ఉంది. ప్రత్యేకంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సంగీత విడాకులు కోరుతూ పిటిషన్ వేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. విజయ్, త్రిషకు మధ్య సంబంధం ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల తమిళనాడుకు చెందిన కొందరు రాజకీయ నేతలు సైతం ఇవే కామెంట్స్ చేశారు. విజయ్ త్రిష ఇంటిని విడిచి ప్రజల్లోకి రావాలంటూ బీజేపీ నాయకుడు నయినర్ నాగేంద్రన్ కామెంట్ చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద వివాదానికి దారి తీశాయి. ఈ వ్యాఖ్యలపై త్రిష తీవ్రంగా స్పందించడం.. ఆ తర్వాత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పడంతో వివాదం కాస్త సద్దుమణిగింది. ఇంతలో సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో.. విజయ్ - త్రిష రిలేషన్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయ్యింది.

## కన్నీరు పెట్టుకున్న కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్న తనను ఆరు నెలలపాటు జైల్లో పెట్టారు. ఇదంతా మోదీ అమిత్ షాల కుట్ర అని, కోర్టు తీర్పు అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయంగా తనను దెబ్బతీయడంతో పాటు 'ఆప్‌కు చెందిన ఐదుగురు నేతలను జైల్లో పెట్టారు. నా జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదు. కేవలం విపక్షాలపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారు. ప్రజా సమస్యలను మోదీ పట్టించుకోరు. నాపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టారు. ఆమ్‌ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు ప్రయత్నించారు. నేను అసలుసిసలైన నిజాయితీపరుడిని. నేను కేవలం ప్రజల కోసమే పనిచేశాను. నిజం ఎప్పటికైనా గెలుస్తుంది' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. సిసోడియాపై ప్రాథమికంగా కేసు కూడా నిలబడలేదని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా లను కోర్టు డిశ్చార్జ్ చేసింది. కేజ్రీవాల్‌ను సరైన ఆధారాలు లేకుండా ఇరికించారని జడ్జి వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కవితతో పాటు ఈ కేసులో ఉన్న 23 మంది నిందితులు తప్పు చేశారన్న సాక్ష్యా దారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యానించింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగానికి గురయ్యారు. మీడియా ముందు కన్నీరు పెట్టుకున్నారు. తీర్పు తర్వాత, తనపై ఉన్న కేసు పూర్తిగా కల్పితమని మరోసారి పునరుద్ఘాటించారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడానికి స్వతంత్ర భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని ఐదుగురు ప్రముఖ నాయకులను జైలులో పెట్టారని గుర్తు చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అరెస్టు చేసి జైలుకు పంపారని, ఇది భారత చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగలేదని అన్నారు. తాను ఆరు నెలలు జైలులో ఉన్నానని, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాదాపు రెండు సంవత్సరాలు జైలులో గడిపారని తెలిపారు. ఈ లిక్కర్ వ్యవహారం కల్పితమని, తన ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా దుష్ప్రచారం చేస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. టీవీ ఛానెళ్లలో తనను పదే పదే అవినీతిపరుడిగా చిత్రీకరించారని కన్నీరుమున్నీరుగా విలపించారు.

## నటుడు సంజయ్‌తో లోకేశ్ భేటీ

ఈ విషయాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా వెల్లడించారు. సంజయ్ దత్‌ను కలవడం ఆనందంగా ఉందని, ఏపీలో సినిమా రంగ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. తన పాదయాత్ర సందర్భంగా రూపొందించిన పుస్తకాన్ని సంజయ్‌కు అందచేశారు.

## ఏపీకి మరో భారీ పరిశ్రమ..

ఏపీ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. దేశంలోనే మొట్టమొదటి అమోర్ఫస్ ఎలక్ట్రికల్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయనున్నారు. అమెరికా-జపాన్ దేశాలకు చెందిన ప్రొటీరియల్ అనే సంయుక్త సంస్థ ఈ ప్రాజెక్టును తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో స్థాపించనుంది. రూ.1350 కోట్ల భారీ పెట్టుబడితో 'మెట్‌గ్లాస్ ఇండియా' పేరుతో ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ స్టీల్ ప్లాంట్‌ను ప్రొటీరియల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అత్యాధునిక జపాన్ టెక్నాలజీని ఉపయోగించి అల్లాయ్ రిబ్బన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలిదశలో ఏటా 30 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 2026 అక్టోబర్ నాటికి పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభిస్తామని ప్రొటీరియల్ సంస్థ సీఈవో శాన్‌స్టాక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాల వల్లే తాము ఇక్కడ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ స్టీల్ ప్లాంట్ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

## దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

## బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను: పవన్ కల్యాణ్

వైసీపీ మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. "శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను" అని తన ప్రకటనలో పేర్కొన్నారు.

# డోన్ సమీపంలో ఘోర ప్రమాదం

దీంతో కారు నుజ్జునుజ్జయింది. ఇందులో ప్రయాణిస్తున్న ఓ మహిళతోపాటు ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలపాలైన ప్రమోద్‌ను 108 వాహనంలో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ రాకేశ్, ఎస్సై మమత ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# శ్రీశైలం దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం











**శ్రీశైలం ఫిబ్రవరి 27(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈనాటి స్వర్ణరథోత్సవంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాస రావు, హిందూధర్మపరిరక్షణ ట్రస్ట్ ఛైర్మెన్ డా. దాసరి శ్రీనివాసులు, ( రిటైర్డు ఐ.ఏ.ఎస్. ) అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





## ఆటో ప్రమాదం డ్రైవర్ మృతి.

### వ్యవసాయ కూలీలకు తీవ్ర గాయాలు.



**బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నంది పత్రిక).** ప్రమాదానికి గురైన స్థానిక సంజీవనగర్ కు చెందిన వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని,గాయపడిన బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని,బేతంచర్ల పట్టణ ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని,రాష్ట్ర వ్యాప్తంగా నగర పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు అయ్యే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని, నాయకుల పరామర్శలు కాదు... పట్టణ ప్రజలకు స్వయం ఉపాధి కావాలని, ఈ ప్రమాదంలో చనిపోయిన ఆటో డ్రైవర్ మధు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని,భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బేతంచెర్ల మండల కార్యదర్శి భార్గవ్.యన్నా డిమాండ్ చేశారు.

## ఫిబ్రవరి 28 శనివారం ట్రేడ్ లైసన్స్ ఫీజుల చెల్లింపు చివరి రోజు.



**బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నందిపత్రిక ).** 2026 – 2027 కు సంభందించి బేతంచెర్ల ఫ్యాక్టరీ యజమానులకు, వ్యాపారస్తులకు ట్రేడ్ లైసన్సుల ఫీజు చెల్లించుటకు ఫిబ్రవరి 28 శనివారం అంటే నేడే చివరి తేది అని బేతంచెర్ల నగర పంచాయితి కమీషనర్ డి. హరిప్రసాద్ ప్రకటన ద్వారా తెలిపారు. శనివారం ( నేడే ) ఫీజు చెల్లించి రశీదు, లైసన్సు ధ్రువీ కరణ పత్రంను తీసుకొన వలయునని కమీషనర్ తెలియ జేశారు. లేనియెడల మార్చి 1 వ తేదీనుండి ఒక నెలకు 25%, ఏప్రిల్ నెల నుండైతే 50% అపరాధ రుసుముతో చెల్లించ వలసి వస్తుందని ఫ్యాక్టరీల యజమానులకు, వ్యాపారస్థులకు తెలియ జేశారు.

## ఇగ్నైట్-2 కే26 జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఘన విజయం



**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 27 . (నంది పత్రిక ):** శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నంద్యాల విద్యార్థులు జాతీయ స్థాయిలో మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థుల ఆవిష్కరణాత్మక ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలు మరియు సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులే ఈ విజయానికి కారణమని తెలిపారు. జాతీయ వేదికపై కళాశాల ప్రతిష్టను నిలబెట్టిన విద్యార్థులను ఆయన అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఇన్నోవేటివ్ ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు.కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. ఎన్. రమాదేవి మాట్లాడుతూ, విద్యార్థులు రూపొందించిన కృశిరక్షక్– ఏఐ ప్రాజెక్ట్ వ్యవసాయ రంగానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారమని పేర్కొన్నారు. పరిశోధనా దృక్పథం, టీమ్‌వర్క్ మరియు కృషి ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు.హైదరాబాద్‌లోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 25,26– 2026న నిర్వహించిన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఇగ్నైతే–2 కే 26" లో రాష్ట్రవ్యాప్తంగా 800కు పైగా టీములు పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల నుండి 6 టీములు పాల్గొనగా, బయటి కళాశాలల మధ్య జరిగిన సాఫ్ట్‌వేర్ విభాగ పోటీలో విద్యార్థులు ఎస్. అమీర్ హుస్సేన్, పి. మదార్ వలి, ఎస్. హైదూమియా మరియు ఎన్. ఫరూక్ రూపొందించిన క్రిషిరక్షక ప్రాజెక్ట్ ఉత్తమ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. పంటల రక్షణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్మార్ట్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ ప్రాజెక్ట్ న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది.

## దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మహాదేవపురం గ్రామంలోని ప్రధాన రహదారి

**శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ గారి కృషితో గ్రామంలో సిసి రోడ్లు ప్రారంభం**

**సంతోషం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు**



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండలం లోని మహాదేవపురంలో ప్రధాన వీధి ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ గారి కృషితో ఆమె ఆదేశాలతో గ్రామంలో సిసి రోడ్ల పనులను ప్రారంభించినట్లు మహాదేవపురం గ్రామం టిడిపి ఇన్చార్జ్ పి. ఎ. సి. యస్. డైరెక్టర్ వి. మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మెయిన్ బజార్ వీధిలో సైడ్ కాలువలు లేక ఎండాకాలం లోకూడా వర్షాకాలాన్ని తలపించే విధంగా మురికి నీరు నిత్యం వీధిలో ప్రవహించేది ఈ విషయాన్ని శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ గారి దృష్టికి తీసుకవెళ్లిన వెంటనే గ్రామానికి సి,సి రోడ్లను సైడ్ కాలువలను మంజూరు చేసినట్లు ఆయన తెలుపుతూ, సైడ్ కాలువలను, సి, సి రోడ్లను పి, ఆర్, డి,ఈ,వెంకట రెడ్డి గారు అదేవిధంగా పి,ఆర్, ఏ, ఈ, రవికుమార్ గారు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణ గారి పర్యవేక్షణలో 15 లక్షల వ్యయంతో మహాదేవపురం గ్రామంలోని మెన్ బజార్ కాలనీ పనులను ప్రారంభించటం జరిగిందని ఆయన తెలిపారు.

## రైతులే పంటలను కాపాడుకోవాలి



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 27** : రైతులు వేసుకున్న పంటలను మీరే కాపాడుకోవాలని ఎత్తిపోతల పథకం అసిస్టెంట్ ఇంజనీర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బండి ఆత్మకూరు లోని ఎత్తిపోతల పథకాన్ని ఆయన సందర్శించారు. రెండు రోజుల క్రితం ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ ను ఆయిల్ ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లారు. ఈ సంఘటనపై ఏఈ నారాయణరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్ పనిచేయకపోవడం వల్ల రైతులు వేసుకున్న పంటలు దెబ్బ తినే అవకాశం ఉందని అన్నారు. ఇందుకు రైతులందరూ సమైక్యంగా ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసుకొని పంటలను కాపాడుకోవాలని సూచించారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని అన్నారు. ఎత్తిపోత పథకం నిర్వహణ రైతులదే కాబట్టి పంటలు కాపాడుకునే విషయంలో రైతులందరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. కోయిలకుంట్ల మండలం కలుగోట్ల ప్రాంతంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్లు కూడా కాపర్ వైర్ ను దొంగిలించుకుని వెళ్లారని, అక్కడ కూడా రైతులే భాగస్వామి వహించి ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసుకుని పంటలను కాపాడుకోవాలని అక్కడి రైతులకు సూచించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఏఈ నారాయణరెడ్డి వెంట టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల ప్రమాణాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి




**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 27 . (నంది పత్రిక ):** శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (ఆటోనమస్) లో ఉప్ స్కిల్లింగ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఎమ్ఎన్సి అంశంపై ఒక రోజు సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల కెరీర్ డెవలప్‌మెంట్ సెల్ మరియు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, అకాడమీ సహకారంతో నిర్వహించారు.కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల ప్రమాణాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో నిపుణులు వివరించారు.అకాడమీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.అకాడమీ రాష్ట్ర ప్రధాన అధికారి ఎస్. దినకర్ రెడ్డి మాట్లాడుతూ ఒక ప్రత్యేక ప్రాజెక్ట్ కింద 70 మంది విద్యార్థులను ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలలో శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు పరిశ్రమ స్థాయి పరిజ్ఞానం మరియు ప్రాక్టికల్ అనుభవం లభిస్తుందని చెప్పారు.కార్యక్రమ సమన్వయకర్త పి. సురేంద్ర బాబు మాట్లాడుతూ, ఈ సదస్సు విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు మరియు ప్రముఖ అతిథులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, అంతర్జాతీయ సంస్థలలో ఉద్యోగ అవకాశాల కోసం సిద్ధం చేసే దిశగా ముఖ్యమైన అడుగుగా నిలిచింది.



## పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే!

అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలోపేతం చేస్తాయని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా – 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన ఏపీ అభివృద్ధి ప్రణాళికలు, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మాట ఇస్తే అది జరిగి తీరుతుందని, ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడమే తన ముందున్న కర్తవ్యమని లోకేశ్ అన్నారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, సవాళ్లను ఇష్టంగా స్వీకరిస్తామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు బిగ్ బ్రదర్ అని, జీవితాంతం తనకు పెద్దన్నేనని ఆయన వ్యాఖ్యానించారు.

## విశాఖకు చెందిన సైబర్ క్రైమ్ నేరస్తుడ్ని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన అంతర్జాతీయ సైబర్ నేరస్తుడ్ని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మాట్రిమోని, క్రిప్టో పెట్టుబడుల పేరిట ప్రజలను మోసం చేసిన అతడిని పెదపూడి ప్రసన్నకుమార్‌గా పోలీసులు గుర్తించారు. మ్యాట్రిమోనిలో యువతిగా ప్రొఫైల్ క్రియేట్ చేసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలువురిని మోసం చేశాడు. అతడు కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రసన్నకుమార్ ఒక మ్యాట్రిమోనియర్ వెబ్ సైట్‌లో యువతి పేరిట నకిలీ ప్రొఫైల్ సృష్టించి బాధితులను పరిచయం చేసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్నాడు. అలాగే నకిలీ క్రిప్టో ట్రేడింగ్ ద్వారా పలువురిని పెట్టుబడులకు ప్రోత్సహిస్తూ మోసం చేశాడు. ఒక బాధితుడిని నిందితుడు రూ.11 లక్షల మేర మోసం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మోసం చేయడానికి వందలాది అక్రమ సిమ్ కార్డులను సేకరించి ఫేక్ ఖాతాలు తెరిచినట్లు పోలీసులు గుర్తించారు.

# ట్రాఫిక్ అంతరాయం కలిగించే వారికి మరియు వాహనాలను దొంగలించే వారికి నేరాలకు పాల్పడే వారికి తస్మాత్ జాగ్రత్త....





**కర్నూలు నగరంలో 722 మ్యాట్రిక్స్ సిసి కెమెరాలు , 100 ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ సీసీ కెమెరాల నిఘా .**

**ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి ...**

**ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం.**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు... ఈ చలాన్ల తో జరిమానాలు.**

**పోలీసు కమాండ్ కంట్రోల్ నుండి సిసి కెమెరాల పర్యవేక్షణ.**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**కర్నూలు నంది పత్రిక....** కర్నూలు పట్టణంలోని ప్రధాన రహదారులు , ట్రాఫిక్ కూడళ్లు , మరియు ముఖ్య మైన రద్దీ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఆధునిక మ్యాట్రిక్స్ మరియు ాా× సీసీ కెమెరాలు 24 గంటలపాటు నిఘా పర్యవేక్షణ కొనసాగుతున్నాయని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే ( ఆటోలు , భారీ వాహనాలు , టూ వీలర్స్ , ఇతర అన్ని రకాల వాహనాలు) వాహనాలను ఆధునిక మ్యాట్రిక్స్ మరియు ాా × సిసి కెమెరాల ద్వారా గుర్తించి, ఆటోమేటిక్ విధానంలో ఈ-చలాన్ ల జరిమానాలు విధిస్తామన్నారు. ఆటోలను ట్రాఫిక్ లో ఎక్కడపడితే అక్కడ రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలపడం, అధిక వేగంతో వాహనాలను నడుపుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం, స్నేక్ డ్రైవింగ్ , ర్యాష్ డ్రైవింగ్ , సైలెన్సర్లు తీసి వేసి బైక్ లు నడపడం, రెడ్ సిగ్నల్స్ దాటడం, మైనర్ డ్రైవింగ్ , ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి పలు రకాల ఉల్లంఘనలను సిసి కెమెరాల ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. ప్రమాదాలను నివారించేందుకు అన్ని రకాల వాహనదారులు, ఆటోల డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.రక్షణ, పర్యవేక్షణ, నిఘా కొరకు 722 మ్యాట్రిక్స్ సిసి కెమెరాలతో పాటు , 100 ాా × ( ాా × ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ) సిసి కెమెరాలకు సాంకేతికతను రూపొందించారన్నారు. నిబంధనలు పాటించని వారి పై చట్ట పరమైన చర్యలు తప్పవని , ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ విజ్ఞప్తి చేశారు.



## నేడు మండల పరిధిలో పింఛన్ల పంపిణీ...

### ఎంపీడీవో గోపికృష్ణ



**జూపాడుబంగ్లా: ఫిబ్రవరి: 27: (నంది పత్రిక)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఒకరోజు ముందుగానే ఇవ్వడం జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గోపికృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో ఫిబ్రవరి 28వ తేదీన ఉదయం ఏడు గంటలకు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పింఛను డబ్బులు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని మొత్తం పింఛన్లు 4856 మందికి గాను రెండు కోట్ల 10 లక్షల 9 వేల 200 రూపాయల నగదును 99 మంది సిబ్బంది పంపిణీ చేయుచున్నట్లు ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం నుండి ఇంటి వద్దనే అధికారులకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో పేర్కొన్నారు. 80బన్నూరు-1, మండ్లేము-2, తంగడంచ-1 స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా మంజూరైనట్లు తెలిపారు.

## జనగణన2027 ను విజయవంతం చేయాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్**




**కర్నూలు, నంది పత్రిక.....**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి జనగణన2027 ప్రకియను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ & టెక్నాలజీ కళాశాలలో భారత జనగణన2027 తొలి దశలో భాగంగా నిర్వహించనున్న గృహ జాబితా మరియు గృహ జనగణన కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు సంబంధించి జిల్లా మరియు చార్జ్ స్థాయి అధికారులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జనగణన దేశ అభివృద్ధికి పునాది వంటిదని తెలిపారు. ప్రతి పౌరుని వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు జనగణన గణాంకాలు ప్రణాళికా రచన, నిధుల కేటాయింపు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు కీలకమని స్పష్టం చేసిన ఆయన, గృహ జాబితా నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. గ్రామం నుండి నగరం వరకు సమన్వయంతో పని చేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో జనగణన2027 కార్యక్రమాన్ని సమగ్రంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో గృహ జాబితా విధివిధానాలు, డిజిటల్ డేటా సేకరణ, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జనగణన అధికారి జాయింట్ డైరెక్టర్ డా.జగన్నాథ్, డిప్యూటీ డైరెక్టర్ దివాకర్ భరిహా, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో (ఇంచార్జి) కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దించడమే లక్ష్యం- సీపీఐ




**పార్టీ కార్యకర్తలే ఉద్యమాలకు బలమైన పునాదులు**

**నంద్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నేతల పిలుపు**

**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 27 . (నంది పత్రిక ):**ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా సీపీఐ పోరాటాలను ఉధృతం చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామాంజనేయులు స్పష్టం చేశారు. నంద్యాల పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సిపిఐ జిల్లా సమితి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా సమితి సభ్యులు సోమన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు, ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ ఇటీవల ఖమ్మం లో జరిగిన సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సభ జయప్రదం కావడం, కొత్త గూడెం లో సిపిఐ స్వంతం గా మేయర్ స్థానంను దక్కించు కోవడం సిపిఐ శ్రేణులను ఉత్తేజాన్ని నింపిందని,కమ్యూనిస్ట్ దిగ్గజం తమిళ నాడు గాంధీ గా పేరు పొందిన దివంగత కామ్రేడ్ఆర్.నల్లకన్ను జీవితం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమనిఆయన ఆశయ సాధనలో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమైన పునాదులను పటిష్టం చేసి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సాగిలపడి, దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిందని నాయకులు తీవ్రంగా విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రతిపక్షాలకు కనీస గౌరవం ఇవ్వకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి లడ్డు వంటి అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెరిగిపోయిన డ్రగ్స్, మెడికల్ మాఫియా కార్యకలాపాలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్రంలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సందర్భంగా పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇంటికి 4లక్షల రూపాయలు ఇస్తామన్న వాగ్దానం నేటికీ అమలు చేయకుండా రాష్ట్రంలో విలువైన వేలాది ఎకరాలను భూములను, అమరావతి రాజధాని పేరుతో మొత్తం 1లక్ష ఎకరాల భూములను సేకరించి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నంద్యాల జిల్లాలో సాగు భూములను బలవంతంగా సేకరించి, పారిశ్రామికవేత్తలకు కారుచౌకగా అప్పగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.ఇప్పటికయినా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని శీడిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురాం మూర్తి, రమేష్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్య ప్రతాప్, ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు శశిధర్ రెడ్డి, మహానంది మండల కార్యదర్శి సామెలు, డోన్ కార్యదర్శి నారాయణ, సీనియర్ నాయకులు సంజీవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఆత్మకూరు తాలూకా కార్యదర్శి ప్రతాప్, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## జాతీయ వేదికపై విద్యార్థుల విజయ కిరీటం

**-సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలతో జాతీయ స్థాయిలో సత్తా చాటిన యువత**

**నంద్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 27 . (నంది పత్రిక ):**నంద్యాలకు చెందిన శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఎఐఎంఎల్ విభాగం మూడవ సంవత్సరం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి మరోసారి తమ సత్తాను చాటుకున్నారు. హ్యాకథాన్ పోటీలలో సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలతో విశిష్ట ప్రదర్శన ఇచ్చి విజేతలుగా నిలిచి కళాశాలకి కీర్తి తీసుకువచ్చారు. విజేతలుగా నిలిచిన వారు కె. క్రాంతి కిరణ్, కె. పవన్ కుమార్, కె. చరణ్ తేజా, టి. ఉదయదీప్. ఈ విజయంతో కళాశాలలో ఆనంద వాతావరణం నెలకొంది.ఈ విజయాన్ని వారు నంద్యాల నగరంలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (స్వయంప్రతిపత్తి) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25-26 తేదీలలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు రీప్లస్మెంట్ 2 కే26 సమ్యక్"లో సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, శాంతిరాం విద్యార్థులు ప్రతిభతో ముందంజ వేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, విద్యార్థులు జాతీయ వేదికపై విజయం సాధించడం గర్వకారణమని తెలిపారు. ఎఐఎంఎల్ విభాగాధిపతి డా. జె. డేవిడ్ సుకీర్తి కుమార్ కూడా విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులతో ముందుకు సాగాలని సూచించారు.విజేతలను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని జాతీయ స్థాయి పోటీలలో కూడా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# ధర్మానికి మూలం గోవు గో సంపదను కోపాడుకోవాలి



**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే**

**-ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు**

**అవుకు. ఫిబ్రవరి 27 . (నంది పత్రిక ):**ధర్మానికి మూలమైన గోవును, గోసంపదను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని, ఇది వ్యక్తి బాధ్యత కాదు, సమిష్టి బాధ్యత అని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అవుకు మండలం, కొండమనాయుని పల్లె గ్రామంలో వెలసిన శ్రీ రామాలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, జయదేవానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న భక్తాదులందరికీ గ్రామ భక్తసమాజం మహాప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో వై.వి. శివారెడ్డి, ఆకుల విశ్వనాథరెడ్డి, ఆకుల నాగిరెడ్డి, బోర్వెల్ శివారెడ్డి, నలుబోలు మల్లారెడ్డి, బోయ జయమ్మ, మోహనరెడ్డి, ఎద్దుల సుబ్బ రాయుడు, గొల్ల వెంకటప్ప, చాకలి కొత్తన్న, గొల్ల శివరాం, పూజారి గురువయ్య, యల్లాల నాగలక్ష్మి, కోనేటి సుబ్బమ్మ, బోయ శేషమ్మ, మంగలి వెంకటప్ప, యర్రగొల్ల రాజశేఖర్, బోయ దస్తగిరి, ఆకుల లక్ష్మి దేవమ్మ, ఆదిలక్ష్మి, మారేమడుగుల లక్ష్మిదేవి, యర్రగొల్ల లక్ష్మిదేవి, ఆకుల పుల్లారెడ్డి, రామాపురం శివారెడ్డి,ఎన్. నారాయణ రెడ్డి,



జూనూతల నాగేంద్రుడు, సిద్దయ్య, రామసుబ్బన్నతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తాదులందరికీ హైదరాబాదులో ఉంటున్న బోయ షేక్షావలి అన్నప్రసాదానికి సహకరించారు.



## ఫ్యాన్సీ శారీ & లేడీస్ కార్నర్ ప్రారంభించిన ఎస్సై మధుసూదన



**సిరివెళ్ల (నంది పత్రిక)** శిరివెళ్ల మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఇమ్రానా కౌశల్ సారీ లేడీస్ కార్నర్ మరియు ఫ్యాన్సీ స్టోర్ ను ఎస్ఐ మధుసూదన శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు సీనియర్ జర్నలిస్ట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి టీవీ 49 రిపోర్టర్ రెహమాన్ ఖాన్ కుటుంబ సభ్యుల యొక్క ఫ్యాన్సీ సారీ లేడీస్ కార్నర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల వైసీపీ మాజీ కన్వీనర్ ఉల్లి సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాపార కేంద్రాల ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎస్ఐ మధుసూదన సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదనకు వైసీపీ మండల మాజీ కన్వీనర్ ఉలి సుబ్బరాయుడును పట్టు శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానం చేశారు నూతన ప్రారంభోత్సవం సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు.



## శ్రీ మద్దులేటీ లక్ష్మీ నారసింహ స్వామి కళ్యాణ మహోత్సవం



**బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నందిపత్రిక ).** ఫాల్గుణ మాస శుద్ధ ఏకాదశి మరియు మృగాశిరా నక్షత్ర శివ కేశవుల కలయిక ఉన్న పర్వ దినమును పురస్కరించుకొని శ్రీ మద్దులేటీ లక్ష్మి నారా నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవమును,బేతంచెర్ల పట్టణ వాస్తవ్యులు లక్ష్మి రెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులతో శుక్రవారం నాడు శ్రీ మద్దులేటీ స్వామి దేవస్థానము వేద పండితులు, అర్చకులతో శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి, శ్రీ స్వామి, అమ్మవారి కళ్యాణం జరిపించడం జరిగింది. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేశారు. ఉపకమీషనర్& దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజ నేయులు,దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.



## జనసేనలో చేరిన శాలివాహన సంఘం నాయకులు,

### వారికి జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన జనసేన ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు



**కర్నూలు నంది పత్రిక.....** జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుమ్మర/శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీవీబీ సుబ్బయ్య ఆధ్వర్యంలో కర్నూలు శాలివాహన సంఘం నగర అధ్యక్షులు కె వి మధు శాలివాహన కమిటీ సభ్యులు కేసి నాగన్న,సంజీవయ్య,తిరుపతయ్య,కె.వి అశోక్ దాదాపు 100 మంది యువకులు మహిళలు పార్టీలో చేరి సభ్యత్వ తీసుకోవడం జరిగింది. వారికి జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు జనసేన కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సామాన్యులకు మధ్యతరగతి వారికి సభ్యత్వం ద్వారా భద్రత కల్పించే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని తెలిపారు. జనసేన పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ ఈరోజు అధికారంలో కీలక పాత్ర పోషిస్తున్నారని రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నదని అన్నారు, కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగ నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ.ప్ర రాష్ట్ర వాల్మీకి/బోయ కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ళ మంజునాద్ పాణ్యం నియోజకవర్గ నాయకులూ. బజారి ఖ. షబ్బీర్ ,దీ. సుధాకర్ ,హుస్సేన్ మరియు కార్యకర్తలు పాల్గొన్నరు.



# పరిసరాల శుభ్రత- ఆరోగ్యానికి భద్రత





**బద్వేల్ ఫిబ్రవరి 27 (నంది పత్రిక ):** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహారెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో, నందిపల్లి లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ప్రతి ఇంటిని లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా ను ఏ విధంగా ఉంటుందో, లార్వాను ఎలా అంతమొందించాలో, నరసింహారెడ్డి మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్యలు వివరించడం జరిగింది. దోమల వలన చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా, బోదకాలు లాంటి ప్రమాదకరమైన జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కడ అవసరమైతే అక్కడ మెడికల్ క్యాంపులను నిర్వహించి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రత్యేకంగా కొళాయి పైపు లీకేజీ పై దృష్టి పెట్టమన్నారు. లీకేజీలు ఉన్నచోట పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిక పదిన తయారు చేయించి,

స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు, సిహెచ్ఓ జోష్ణ, ఏఎన్ఎం రాములమ్మ, వైద్య సిబ్బంది లో పాల్గొన్నారు.

## సాగులో 'సూర్యోదయం': ప్రకృతి వ్యవసాయంతో లక్షల లాభాలు!




**నంది పత్రిక -ప్యాపిలి** నేలతల్లిని నమ్ముకుంటే నష్టం రాదని, ప్రకృతితో కలిసి సాగితేనే ఆరోగ్యం మరియు ఆదాయం లభిస్తాయని నిరూపిస్తున్నారు ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన ఒక సామాన్య రైతు. రసాయన ఎరువుల ఖర్చులతో కుదేలవుతున్న రైతులకు 'ప్రకృతి సాగు' ప్రాణవాయువులా మారుతుందని ప్యాపిలి మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన పి. సూర్య నారాయణ తన విజయగాథతో చాటిచెబుతున్నారు.

**చేదు అనుభవం నుంచి సాగు ప్రయోగం వరకు..** 2011 నుండి 2015 వరకు సూర్య నారాయణ రసాయన పద్ధతిలో వ్యవసాయం చేశారు. పెట్టుబడి పెరగడం, దిగుబడి తగ్గడం, దానికి తోడు కుటుంబంలో అనారోగ్య సమస్యలు ఆయనను కలచివేశాయి. ఆ సమయంలో యంసీఆర్పీ జయరామిరెడ్డి మార్గదర్శకత్వంలో ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. కేవలం 20 సెంట్ల మల్లె తోటలో ద్రవ జీవామృతాన్ని ఉపయోగించి ప్రారంభించిన ప్రయోగం, నేడు ఆయన జీవితాన్ని మార్చేసింది.

**పూల సాగులో 'పుష్కలమైన' లాభాలు** ప్రకృతి పద్ధతిలో పండించిన మల్లెలు ఎక్కువ కాలం తాజాగా ఉండటం గమనించిన సూర్య నారాయణ, తన సాగును 2.20 ఎకరాలకు విస్తరించారు.

పెట్టుబడి 3 లక్షలు3 ఏళ్లలో ఆదాయం10 లక్షలు నికర లాభం 7 లక్షలు నీమాస్త్రం, దశపర్ణి కషాయం వంటి ప్రకృతి సిద్ధ ద్రావణాలను వాడటం వల్ల పురుగుల ఉధృతి తగ్గి నాణ్యమైన దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు.

**పీఎండీఎస్ విధానంతో వినూత్న సాగు** ప్రస్తుతం ఆయన తన 1.2 ఎకరాల ఎర్ర నేలలో పీఎండీఎస్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రధాన పంట వేరుశెనగ అంతర పంటలు కంది, అలసంద, టమోటా రక్షణ సరిహద్దు పంటలుగా జొన్న, మొక్కజొన్న. విత్తన శుద్ధికి బీజామృతం, భూసారానికి ఘన జీవామృతం వాడుతూ కేవలం ₹20,000 పెట్టుబడితో ₹1,16,000 నికర లాభాన్ని ఆర్జించారు. అంటే పెట్టిన ప్రతి రూపాయికి 6.3 రెట్ల లాభం రావడం విశేషం.

**నందీశ్వర బయో-ఇన్‌పుట్ సెంటర్: తోటి రైతులకు ఆసరా** తాను లాభపడటమే కాకుండా, తోటి రైతులకు ప్రకృతి సిద్ధ ఎరువులు, కషాయాలు అందించేందుకు లక్ష రూపాయల వ్యయంతో 'నందీశ్వర బయో-ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో మరో 10 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం బాట పట్టారు. 2021లో ప్రభుత్వం నుండి ఉత్తమ రైతు అవార్డు అందుకున్న సూర్య నారాయణ.. "బావితరాలకు విషరహిత భూమిని అందించడమే రైతు నిజమైన సంపద" అని గర్వంగా చెబుతున్నారు.




## ప్రమాదంలో గాయపడిన వైఎస్ఆర్సిపి నాయకుడు జయరాం రెడ్డిని పరామర్శించిన పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల, ఫిబ్రవరి 27(నంది పత్రిక )** పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు నేలటూరి జయరాం రెడ్డి ఇటీవల మోటార్‌బైక్ ప్రమాదంలో ఎడమ కాలు విరగడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో తన చెల్లెలు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి జయరాం రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స వివరాలను వైద్యుల ద్వారా తెలుసుకుంటూ, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, జయరాం రెడ్డి త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు కూడా ఆయన త్వరితగతిన కోలుకోవాలని కోరుకుంటున్నారు.

## డిప్యూటీ డీఈఓ పాఠశాలల సందర్శన





**మర్రిపాడు ఫిబ్రవరి 27నంది పత్రిక** : కదిరినాయుడు పల్లి,చిలకపాడు ఉన్నత పాఠశాలలను ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖాధికారి జానకిరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు పదవ తరగతి వందరోజుల కార్యక్రమం, జీ.ఎఫ్.ఎల్.ఎన్,విద్యా శక్తి తదితర కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులు,విద్యార్థులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి, చిలకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి కేశవరెడ్డి,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుందూ నది కరకట్టను అక్రమంగా తీసుకెళ్తున్న వారిని అడ్డుకుంటాం.

### సిపిఎం పార్టీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక



**కోయిలకుంట్ల ఫిబ్రవరి 27నందిపత్రిక** కోయిలకుంట్ల పట్టణ సమీపంలో ఉన్న కుందునది వరద ఉధృతిని అడ్డుకుని దిగువనున్న గ్రామాలను కాపాడేందుకు అప్పటి ప్రభుత్వం నదికి ఇరువైపులా వేసిన కరకట్టలను ఇష్టరాజ్యాంగ తరలిస్తు రోడ్డు నిర్మాణానికి వాడడం అక్రమం అన్యాయమని దీన్ని అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం కోయిలకుంట్ల కార్యాలయం లో వారు మాట్లాడుతూ కుందూ నది వెడల్పులో భాగంగా తీసిన బిల్కును ఇప్పటికే జే ఆర్ సి సంస్థ వారు నేషనల్ హైవేకు ఇష్ట రాజ్యాంగ వాడుకోవడం జరిగింది. దీనికి పర్మిషన్లు ఉన్నాయా లేవా అనేది కుందు నది పరివాహక గ్రామాల ప్రజలకు తెలియదు. ఇప్పటికే ఉన్న బిల్కు మొత్తాన్ని వాడుకోవడం జరిగింది. ప్రస్తుతం నది వెంబడి భీమునిపాడు గ్రామానికి సమీపంలో గ్రామంలోకి పంట పొలాల్లోకి వరదలు రాకుండా కరకట్టలుగా ఉన్న వీటిని కూడా అక్రమంగా తీసుకెళ్లడం పూర్తి అన్యాయమని రేపటి రోజున అనగా 28- 2- 2026 ఉదయం 10 గంటలకు సిపిఎం పార్టీ ఇతర ప్రజా సంఘాలుగా అడ్డుకోబోతున్నట్లు దీనికి ప్రజా సంఘాలు అందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

## చౌడేశ్వరి అమ్మవారికి పల్లకి సేవ



**బనగానపల్లె ఫిబ్రవరి 27 నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం లో ఆలయ సిబ్బంది, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పవన్ క్యాంపు కార్యాలయంలోకి చొరబడిన వ్యక్తి... రెండు వాహనాలు ధ్వంసం!

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళగిరిలో జనసేన ప్రధాన కార్యాలయంలోకి ఓ అజ్ఞాత వ్యక్తి ప్రవేశించి వీరంగం సృష్టించాడు. పవన్ కల్యాణ్ కాన్వాయ్‌లోని రెండు వాహనాలపై దాడి చేసి ధ్వంసం చేయడంతో కార్యాలయ ఆవరణలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి ఆటోలో వచ్చిన సదరు వ్యక్తి నేరుగా కార్యాలయం లోపలికి ప్రవేశించాడు.

# శ్రామికులకు 125 రోజుల పని దినాలు కల్పిస్తాం





## ఏపీవో డాక్టర్ వసుధారెడ్డి

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 27:** వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ గార్ పథకంపై ప్రజలు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని ఆ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వసుధారెడ్డి అన్నారు. ఈ పథకం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఎంపీడీవో గాయత్రి తో కలిసి శుక్రవారం సాయంత్రం శ్రామికులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకం ఏప్రిల్ ఒకటి నుండి వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ గార్ మరియు అజీవిక మిషన్ ( గ్రామీణ) చట్టం 2025 గా మార్పు చెందుతుందని అన్నారు. ఈ పథకంలో గ్రామీణ పేద కుటుంబాలకు ఒక ఆర్థిక సంవత్సరంలో నైపుణ్యం లేని శ్రామికులకు 125 రోజుల పని దినాలను కల్పించబోతున్నారని అన్నారు. 2025లో చేసిన ఉపాధి హామీ చట్టము సవరించి 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఆధునిక రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. 125 రోజుల పని దినాలను కల్పించడంతోపాటు నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే ప్రత్యేక పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం జరిగిందన్నారు. సృష్టించిన అన్ని ఆస్తులు వికసిత్ భారత గ్రామీణ పోర్టల్ నందు కనపడుతాయని వీటిని ఎవరైనా వీక్షించవచ్చునని అన్నారు. నిర్ణీత సమయంలో వేతనాలు చెల్లింపు పని కల్పించని యెడల నిరుద్యోగ భృతి పై చెల్లింపు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వ్యవసాయ సీజన్లో రైతులకు శ్రామికులకు అందుబాటులో ఉండే విధంగా 60 రోజుల విరామం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆ సీజన్లో ఉపాధి పనులను పెట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని అన్నారు. అజీవిక మిషన్ గ్రామీణ చట్టం ద్వారా ప్రజలకు రైతులకు అవగాహన పెంచేలా ఆరువారాలపాటు ప్రజా చైతన్య కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఫిబ్రవరి నెల 27 నుండి మార్చి 25 వరకు జరిగే చైతన్య కార్యక్రమాలలో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామ స్థాయిలో సామూహిక ప్రతిజ్ఞలు, రచ్చబండపై గ్రామస్థాయి సమావేశాలు, కొత్త చట్టంపై ప్రజా ప్రతినిధులతో చర్చా కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని అన్నారు. అనంతరం శ్రామికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. 125 రోజుల పని దినాలకు సంబంధించి కార్య చరణ ప్రణాళికకు సంబంధించిన కరపత్రాలను శ్రామికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి,ఏపీవో డాక్టర్ వసుధారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్ నాయుడు,టెక్నికల్ అసిస్టెంట్ రోజా రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తో పాటు శ్రామికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల గురించి సమర్థవంతంగా ప్రచారం చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



**కర్నూలు, నంది పత్రిక.....**ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కలిగేలా సమర్థవంతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన స్వర్ణాంధ్రఏ2047 క్యాలెండర్ ను శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిడిడిపి, తలసరి ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ఆయా శాఖల అధికారులు ప్రణాళికా బద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజల నుండి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చేలా అధికారులు పని చేయాలని సూచించారు. ఆయా శాఖల కు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ గ్రేడ్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..వ్యవసాయం, పశు సంవర్ధకం, డ్రిప్ ఇరిగేషన్ తదితర రంగాల్లో రైతుల తలసరి ఆదాయం పెరిగేలా బలోపేతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, డీఆర్డీఏ పిడి రమణారెడ్డి, సమాచార శాఖ ఉప సంచాలకులు జయమ్మ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి..!



## జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా

**కడప చీఫ్ బ్యూరో , ఫిబ్రవరి 27 : నంది పత్రిక** పారిశ్రామిక వనరులు పుష్కలంగా ఉన్న కడప జిల్లాలో.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (ఞ×జ్ఞూజ) సమావేశం జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధ్యక్షతన జరిగింది.

**ఈ సందర్భంగా జేసీ డా. నిధి మీనా** మాట్లాడుతూ... జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసి.. పరిశ్రమల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు.సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మొత్తం 18 శాఖలకు సంబంధించి 11,033 దరఖాస్తులు అందగా, వాటిలో ఇప్పటి వరకు 10,886 దరఖాస్తులకు అనుమతి ఇవ్వడం జరిగిందని, 10,836 దరఖాస్తులు పరిశీలనలో, 50 పరిశీలనకు సిద్ధంగా ఉన్నాయని, 88 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించడం జరిగిందన్నారు. 59 దరఖాస్తులు పలు కారణాల వల్ల పెండింగ్ లో ఉంచడం జరిగిందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ ప్రకారం జిల్లాలో మొత్తం రూ. 3,53,98,514 ల మేర నిధుల విడుదలకు అనుమతినివ్వడం జరిగిందన్నారు. ఇందులో ఐడిపి 2023-27 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 1,17,12,829 లు. ఐడిపి 2024-29 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 2,35,99,841 ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐడిపి 2020-23 పాలసీ ప్రకారం ఓబీసీ కేటగిరి క్రింద రూ. 85,844 లు, మేర నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రాత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబందించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. అంతకుముందు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం చాంద్ బాషా సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా.. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సమావేశంలో సిక్కి డిసి డి. జ్ఞాన ప్రకాష్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ చిన్నారావు, ఎల్డిఎం జనార్ధనం, సోషల్ వెల్ఫేర్, డిఆర్డీఏ, మెప్మా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ అధికారులు, డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడీసీఎల్ శాఅధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ లో ఉన్న గోదాముల నిర్మాణాలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక.....**పెండింగ్ లో ఉన్న గోదాముల నిర్మాణాలు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి కో ఆపరేటివ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాముల ద్వారా రైతుల ఆదాయాన్ని ఎలా పెంపొందించాలనే విషయంపై కో ఆపరేటివ్ అధికారులు యాక్షన్ ప్లాన్ చేసుకొని రావాలన్నారు. జిల్లాలో మొత్తం 73 గోదాములు మంజూరవ్వగా, ప్రస్తుతం 50 మాత్రమే పూర్తయ్యాయని అందులో 22 మాత్రమే సంఘాలకు అప్పగించారన్నారు. మిగిలిన వాటిని మార్చి 15వ తేదీ లోపు సంఘాలకు అప్పగించాలన్నారు. అదే విధంగా సహకార బ్యాంక్ కి సంబంధించి పురోగతి తక్కువగా ఉందని పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు ఎక్కువగా ఉన్నందున, తలసరి ఆదాయాన్ని మరియు జిల్లా స్థూల ఉత్పత్తిని పెంచడంలో ఈ సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. గోదాములకు అనుసంధానంగా ఉండేలా (ఉపాధి హామీ పథకం) ద్వారా చిన్న చిన్న రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. సహకార సంఘాల వ్యాపారాభివృద్ధి కోసం జన ఔషధి కేంద్రాలను నిర్వహిస్తున్నారని, వీటిని ప్రభుత్వ ఆసుపత్రుల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందుబాటులోకి వస్తాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కో ఆపరేటివ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

## - ఐసిడిఎస్ సూపర్వైజర్

**కొత్తపల్లి - నంది పత్రిక :** బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రలో బాల్య వివాహాలపై గ్రామసభ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు వివాహాలను చేయడం నేరమన్నారు బాల్య వివాహాల నివారణ కోసం ప్రత్యేక కమిటీ ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు బాల్య వివాహాల నివారణ కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి ఆ గ్రామసభల్లో గ్రామ పెద్దలను గ్రామస్తులను పిలిపించి అవగాహన కల్పించాలి అన్నారు. బాల్య వివాహాల చేయడం వల్ల బాలికల భవిష్యత్తుకు భంగం కలుగుతుంది అన్నారు. బాల్య వివాహాలతో బాలికల జీవితం నాశనం అవుతుంది అన్నారు పాఠశాలల్లో చదువుతున్న బాలికలను మధ్యలో చదువు ఆపేసి బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు.

కమిటీ సభ్యులు గమనించి బాలికలు మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి పాఠశాలలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజ అభివృద్ధిలో బాలికల పాత్ర చాలా ప్రాముఖ్యం అన్నారు. బాల్య వివాహాలు చేయకుండా ప్రతి ఒక్కరం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ కే లింగమ్మ అంగన్వాడీ టీచర్లు రవణమ్మ మరియమ్మ విజయమ్మ శేషమ్మ బాల్య వివాహాల కమిటీ సభ్యులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# బనగానపల్లె నూతన ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



**బనగానపల్లె ఫిబ్రవరి 27నందిపత్రిక** బనగానపల్లె రెవిన్యూ డివిజన్ కు నూతన ఆర్డీఓ గా నరేంద్రనాద్ రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం 10 గంటల సమయంలో అయన కార్యాలయానికి చేరుకొని బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ నారాయణరెడ్డి రెవెన్యూ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్బంగా తహసీల్దార్ నియెజకవర్గ మండలాల్లో రెవిన్యూ శాఖ లో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ ల వివరాలను ఆర్డీఓ కు అందజేశారు.ఈయన 2009 సంవత్సరం లో గ్రూప్ 2 సెలక్షన్ లో డిప్యూటీ తహసీల్దార్ గా నియమితులయ్యారు.అనంతరం బేతంచెర్ల పాణ్యం తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తూ ఉండగా డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొంది ఇపుడు ఆర్డీఓగా బనగానపల్లె కు నియమితులయ్యారు.

**యాగంటి ఉమామహేశ్వరుని దర్శించుకున్న ఆర్డీఓ** బనగానపల్లె నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్రనాద్ రెడ్డి అనంతరం తన కుటుంబ సభ్యులతో యాగంటి చేరుకొని ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహనధికారి పాండు రంగారెడ్డి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అర్చకులతో స్వామి వారికీ పూజాకార్యక్రమాలు చేయించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.



# ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై ప్రజలకు అవగాహన సదస్సులు



## - ఏపీవో విమలమ్మ

**కొత్తపల్లి - నంది పత్రిక:** ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై ప్రజల్లో ఉన్న అపోహాలు తొలగించేందుకు శుక్రవారం మండలంలోని నందికుంట, జి.వీరాపురం, గోకవరం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి గ్రామాలలో ఏపిఓ విమలమ్మ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కొత్త చట్టంలో భాగంగా వేతనాలు ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. 100 రోజుల పనిదినాలను 125 రోజులకు ప్రభుత్వం పెంచిందన్నారు. 100 రోజులు పని దినాలు పూర్తి చేసిన శ్రామిక కుటుంబాలను సన్మానిస్తారని చెప్పారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. పేరులో మార్పులు తప్ప పనుల్లో ఎటువంటి మార్పులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు మజాహర్, శ్రీరాములు, ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు కళ్యాణ్ కుమార్, విజయలక్ష్మి, రామలక్ష్మి, స్వాములు, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.



# సహకార శాఖ పథకాల అమలు వేగవంతం చేయాలి






## జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 27(నంది పత్రిక):–** జిల్లాలోని 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పాక్స్) లో కంప్యూటరైజేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటి సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా సహకార అధికారి యన్. రామాంజనేయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సహకార శాఖ ద్వారా అమలు అవుతున్న వివిధ పథకాల పురోగతి, లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పాక్స్ )లో కంప్యూటరైజేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు కావాలన్నారు. జిల్లాకు మొత్తం 128 గోదాములు మంజూరు కాగా, అందులో 125 గోదాముల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. 82 గోదాములకు నాణ్యత తనిఖీలు పూర్తయ్యాయని, 62 గోదాములను సంబంధిత సంఘాలకు అప్పగించామని, మిగిలిన 22 గోదాములు కూడా సభ్యులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన గోదాములను సభ్యులు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ఎరువుల పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, పాక్స్ ల ద్వారా సరైన నిల్వ మరియు పంపిణీ నిర్వహణ చేపట్టాలని సూచించారు. పాక్స్ లలో డ్రోన్లు కొనుగోలు చేసి రైతు సభ్యులకు అందుబాటులో ఉంచే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వంత భవనం లేని సహకార సంఘాలకు రూ. 24 లక్షల అంచనాతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కోరారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వరల్డ్ లార్గెస్ట్ గ్రాయిన్ స్టోరేజ్ ప్లాన్ కింద కొత్త గోదాముల నిర్మాణానికి తక్షణ ప్రతిపాదనలు పంపాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు నేరుగా లబ్ధి చేకూరేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

# క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేద్దాం

## జనసేన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య




**కోయిలకుంట్ల ఫిబ్రవరి 27నందిపత్రిక** జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు జనసేన నాయకులు క్రియాశీలంగా వ్యవహారించాలని జనసేన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య అన్నారు. శుక్రవారం కోవెలకుంట్లలోని మార్కెట్ యార్డులో బనగానపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్, పిఓసి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యమి క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త క్షేమాన్ని ఉండేందుకు ఇన్సూరెన్స్ సౌకర్యం కలిపించారాని తెలిపారు.బనగానపల్లి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతంగా ఉదృతంగా రికార్డు స్థాయిలో చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను పార్టీ త్వరలోనే గుర్తిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. జనసేన నాయకులు భాస్కర్, దోడియం గురప్ప, కోవెలకుంట్ల వ్యవ సాయం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చెన్న కృష్ణుడు,నాయకులు పృధ్వి, అజిత్, బోధనం ఓబులేసు రాజు, జనార్ధన్, షేక్షావలి, ఇమామ్, మురళి, రమేష్, ప్రభాకర్, చంద్రశేఖర్, గురప్ప, పాల్గొన్నారు.



# ఉచిత రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 27(నంది పత్రిక):–** ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం (కాపెక్స్ విధానం) కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులందరికీ ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీ, పొన్నాపురం ఎస్సీ కాలనీలో ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా ఏర్పాటు చేస్తున్న 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల స్థాపన ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న లబ్ధిదారురాలు సమాదానమ్మ గారి నివాస గృహంపై యాక్సెస్ సోలార్ వెండర్ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్లాంట్ పనితీరు, ఉత్పత్తి సామర్థ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థ యాక్సెస్ సోలార్ వెండర్ (నంద్యాల), రోటోమాగ్ ఎనర్‌టెక్ లిమిటెడ్ (డోన్, ఆత్మకూరు) సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంబంధిత వెండర్ ప్రతినిధులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పేద మరియు బలహీన వర్గాల ప్రజలకు విద్యుత్ వ్యయభారం గణనీయంగా తగ్గడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వినియోగం పెరిగి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, ఈఈ (ఆపరేషన్) నంద్యాల, ఈఈ ఎంఆర్‌టిం నంద్యాల, డీఈఈ డిస్ట్రిబ్యూషన్ నంద్యాల, డీఈఈ టీఆర్ఈ నంద్యాల, డీఈఈ కన్స్ట్రక్షన్ నంద్యాల, ఏఈ డి2 నంద్యాల మరియు ఓ అండ్ ఎం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ల నమోదు మరియు ఓటర్ల మ్యాపింగ్ కోసం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహణ

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 27(నంది పత్రిక):–** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 2002 ఎస్ ఐ ఆర్ ఓటర్లను 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సూచనల మేరకు, ఓటర్ల సంతానం వివరాలతో సహా మ్యాపింగ్ ప్రక్రియను సమయానుకూలంగా పూర్తి చేయాలని, బి ఎల్ ఓ యాప్‌లో అందుబాటులో ఉన్న నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ నేపథ్యంలో మ్యాపింగ్ పురోగతిని వేగవంతం చేయడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఎలక్షన్ డీటీలు, బీఎల్ఓ సూపర్వైజర్లు మరియు బీఎల్ఓలు ఓటర్ల మ్యాపింగ్ పురోగతిని సమీక్షించి, 2026 మార్చి 15 నాటికి గరిష్ట శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించామన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో క్రింది తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. 28 ఫిబ్రవరి 2026 (శనివారం), 1 మార్చి 2026 (ఆదివారం) , 7 మార్చి 2026 (శనివారం) , 8 మార్చి 2026 (ఆదివారం) ప్రత్యేక శిబిరాల సమయంలో ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవడం, సంతానం వివరాలను నమోదు చేయడం, పేరు చేర్పు/తొలగింపు/సవరణలకు సంబంధించిన అభ్యర్థనలు సమర్పించుకోవడం వంటి సేవలను పొందవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితా శుద్ధి మరియు మ్యాపింగ్ ప్రక్రియలో సహకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు.

# నేడు 28 న పెన్షన్లు పంపిణీ ఎంపీడీఓ



**శిరివెళ్ల (నంది పత్రిక) :** మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ సామాజిక పెన్షన్ దారులకు ఫిబ్రవరి 28 శనివారం ఉదయం 7 గంటలకు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప తెలియజేశారు. మార్చి నెల 1 వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్రప్రభుత్వం ఈ నెలాఖరులోనే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు ఎంపిడిఒ తెలియజేశారు.. మండల పరిధిలోని వితంతు వృద్ధాప్య వికలాంగ అనారోగ్య సంబంధిత లబ్ధిదారులకు వేర్వేరుగా పింఛన్లను అందజేసేందుకు అధికారులు ఫిబ్రవరి 27 శుక్రవారమే సిద్ధమైనట్లు తెలియజేశారు. 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గతేడాది చివరి రోజునే పింఛన్లను పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం ఈసారి ఫిబ్రవరి 1 తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇవ్వాల్సి ఉంది. కానీ ఆరోజు సైతం ఆదివారం కావడంతో జనవరి నెల 31నే లబ్ధిదారులకు అందజేయగా తిరిగి మార్చి 1 సైతం ఆదివారం కావడం పట్ల ఫిబ్రవరి 28 న పెన్షన్ పంపిణీకి ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మిగిలినవారికి మార్చి 2 వ తేదీ పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప స్పష్టం చేశారు. ఈనెల 28 వ తేదీ శనివారం పింఛన్లను పంపిణీ చేసేందుకు సచివాలయాల సిబ్బంది 27నే బ్యాంకుల నుంచి 7840 మంది లబ్ధిదారులకు మూడు కోట్ల 37 లక్షల 88 వేళ రూపాయల నగదును డ్రా చేయనున్నట్లు శనివారం ఉదయమే ఇంటింటికి తిరిగి పింఛన్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన పంపిణీ పై ఎంపీడీవో క్లారిటీ ఇచ్చారు.

# స్టీల్ బ్రిడ్జి పనులు పరిశీలించిన నారాయణ

ఉండవల్లిలోని స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును పాత గుంటూరు హైవేకు కలిపేలా ప్రభుత్వం స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతోంది. ఈ పనులను పరిశీలించిన మంత్రి.. కాంక్రీట్ పిల్లర్లపై స్టీల్ గడ్డర్ల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. మొత్తం 88 గడ్డర్లకు గానూ 20 గడ్డర్లు పూర్తయ్యాయని ఇంజినీర్లు తెలిపారు. స్టీల్ బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి వారికి సూచించారు.

# సీఎం చంద్రబాబుపై ఫేక్ పోస్టులు.. సీఐడీ డీజీకి టీడీపీ నేతల ఫిర్యాదు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారంటూ తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు నేడు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్, ఇతర నేతలు సీఐడీ డీజీని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ సోషల్ మీడియా విభాగం 'ఫేక్' పత్రాలతో విష ప్రచారం చేస్తోందంటూ వారు ఆధారాలను సమర్పించారు. అనంతరం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఘోరంగా ఓడించి 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ తీరులో మార్పు రాలేదని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న జగన్.. చంద్రబాబుపై బురద జల్లి మళ్లీ సీఎం పీఠం ఎక్కాలని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల భార్గవ రెడ్డి కలిసి ఒక 'నేరపూరిత కుట్ర'కు తెరలేపారని తీవ్ర ఆరోపణలు చేశారు.

# అక్కినేని పురస్కారం అందుకున్న హని ఫౌండేషన్ అధినేత హని వర్ష రెడ్డి




**కర్నూలు నంది పత్రిక....** కర్నూలు చెందిన ప్రముఖ చిత్రాకారిని హని ఫౌండేషన్ చైర్మన్ హని వర్ష రెడ్డి అక్కినేని పురస్కారం అందుకున్నారు. గానసభ కళాక్షేత్రంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా ఆదివారం ఈ పురస్కారం అందజేశారు.హనీఫౌండేషన్ అధినేత హని వర్షా రెడ్డి మాట్లాడుతూ వివిధ కళలు సామాజిక సేవలో భాగంగా తనకు ఈ పురస్కారం లభించింది అని పేర్కొన్నారు పురస్కారం అందుకున్న హనివర్ష రెడ్డిని పలువురు అభినందించారు...

# ఆదాయం, ఆరోగ్యం, భూసారమే ప్రధాన లక్ష్యాం గా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలిచిన రైతు



## పి. సూర్య నారాయణ..

**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 27 ( నంది పత్రిక )**రసాయన రహిత సాగు – ఆరోగ్యకరమైన సమాజం: నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన పి. సూర్య నారాయణ అనే సాధారణ రైతు, నేడు అసాధారణ విజయంతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఒకప్పుడు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో పెరిగిన పెట్టుబడి ఖర్చులు, క్రమంగా తగ్గిన దిగుబడులు మరియు పదేపదే ఎదురయ్యే కుటుంబ ఆరోగ్య సమస్యలతో ఆయన సతమతమయ్యారు. 2011 నుండి 2015 వరకు చేసిన సాంప్రదాయ రసాయన వ్యవసాయం ఆయనకు చేదు అనుభవాలనే మిగిల్చింది. అయితే, యంసీఆర్‌పీ జయరామిరెడ్డి గారి మార్గదర్శకత్వం సూర్య నారాయణ జీవితాన్ని ఒక్కసారిగా మలుపు తిప్పింది. ప్రకృతితో కలిసి నడిస్తేనే ఆరోగ్యం, ఆదాయం లభిస్తాయని గ్రహించిన ఆయన, తన 1.2 ఎకరాల ఎర్ర నేలనే ప్రయోగశాలగా మార్చుకున్నారు.

**చిన్న అడుగు.. చక్కని లాభం:** తొలుత కేవలం 20 సెంట్ల మల్లె తోటలో 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని ఉపయోగించి ప్రయోగాత్మకంగా సాగు మొదలుపెట్టారు. అదే సమయంలో మిగిలిన భూమిలో రసాయన పద్ధతిని కొనసాగించారు. అయితే, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన మల్లె పూలు ఎక్కువ రోజులు తాజాగా ఉండటం, నాణ్యత పెరగడం ఆయనను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నమ్మకంతో 2017–18 నాటికి తన సాగును 2.20 ఎకరాలకు విస్తరించి లిల్లీ పూలను సాగు చేశారు. ద్రవ జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం వంటి ప్రకృతి వనరులతో సిద్ధం చేసుకున్న కాషాయాలు, ద్రావణాలను 30 సార్లకు పైగా వాడటం వల్ల పురుగుల సమస్య తగ్గి, దిగుబడి అమాంతం పెరిగింది. ఫలితంగా మూడు ఏళ్ల కాలంలో కేవలం 3 లక్షల పెట్టుబడితో 10 లక్షల ఆదాయం పొంది, 7 లక్షల నికర లాభాన్ని ఆర్జించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**పీఎండీఎస్ విధానం: జీవవైవిధ్యంతో కూడిన సంపద:** ప్రస్తుతం 2025 ఖరీఫ్ సీజన్‌లో ఆయన పీఎండీఎస్ (ప్రీఖా) విధానాన్ని అనుసరిస్తూ వేరుశెనగను ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. కేవలం ఒకే పంటకు పరిమితం కాకుండా కంది, అలసంద, టమోటా వంటి అంతర పంటలను, సరిహద్దు పంటలుగా జొన్న, మొక్కజొన్నలను సాగు చేస్తూ పొలాన్ని ఒక పచ్చని తోటలా మార్చారు. విత్తన శుద్ధి కోసం బీజామృతం, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధి కోసం ఘన జీవామృతం వాడుతూ, పురుగుల నియంత్రణకు పసుపు–నీలి జిగురు అట్టలు, లింగాకర్ష బుట్టలు మరియు పక్షి స్థావరాలను ఏర్పాటు చేశారు. ఈ పద్ధతిలో 1.2 ఎకరాల్లో కేవలం 20 వేల రూపాయల పెట్టుబడితో 35 బస్తాల వేరుశెనగ దిగుబడి సాధించి 1,16,000 రూపాయల నికర లాభాన్ని పొందారు. అంటే ఆయన పెట్టిన ప్రతి రూపాయికి 6.3 రెట్ల లాభం రావడం ప్రకృతి వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని చాటిచెబుతోంది.

**సామాజిక బాధ్యత.. భవిష్యత్ తరాలకు మార్గదర్శనం:** ఆయన విజయం కేవలం తన పొలానికే పరిమితం కాలేదు. తోటి రైతులకు సహాయం చేయాలనే తపనతో లక్ష రూపాయల పెట్టుబడితో 'నందీశ్వర బయో–ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (దీ=జ)' ను స్థాపించి, రైతులకు అవసరమైన ప్రకృతి సిద్ధ ఇన్‌పుట్లు మరియు మార్కెటింగ్ సహాయాన్ని అందిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో గ్రామంలో మరో 10 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. 2021లో ప్రభుత్వం నుండి ఉత్తమ రైతు అవార్డు అందుకున్న ఆయన, "బావితరాలకు మంచి భూమిని అందించడమే రైతు నిజమైన సంపద" అని నమ్ముతారు. "చిన్నగా మొదలుపెట్టండి, సహనంతో కొనసాగండి – నేల, ఆరోగ్యం, జీవితం అన్నీ మారుతాయి" అనే ఆయన సందేశం నేడు వేలాది మంది రైతులకు దిక్సూచిగా నిలుస్తోంది.



# వైభవంగా కళ్యాణ రామస్వామి దేవస్థానం 35 వార్షికోత్సవం ముగింపు వేడుకలు.



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామంలో వెలసిన కళ్యాణ రామస్వామి ఆలయ 35వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరిగింది. శుక్రవారం నాడు ఉదయాన్నే కళ్యాణ రామస్వామికి అర్చకుడు కేశవాచార్యులు పంచామృత అభిషేకం, ఆకు పూజ, అర్చనలు, తీర్థ ప్రసాదాలు స్వామివారికి అందజేయడం జరిగింది. తర్వాత వచ్చినటువంటి భక్తులు భజనలు నిర్వహించారు. తదానంతరం వచ్చినటువంటి భక్తులకు గ్రామస్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఎస్సీ, ఎస్టీ బాధితులకు అన్ని విధాల న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంది




## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 27(నంది పత్రిక):-** ఎస్సీ, ఎస్టీ బాధిత కేసులలో సంబంధీకులకు తక్షణ న్యాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి, డీఆర్ఓ రాము నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, నంద్యాల మరియు డోన్ ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, డివియంసి కమిటీ సభ్యులు బాల నాగన్న, నాగరాజు, కాశన్న, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, వెంకటేష్ నాయక్, మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో అధికార యంత్రాంగం బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందనతో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతిపై వివరాలు తెలియజేస్తూ, ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2025 వరకు మొత్తం 365 మంది నిందితులపై ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని తెలిపారు. ఈ కాలంలో 639 మంది బాధితులకు రూ. 8.74 కోట్ల పరిహారం అందించినట్లు చెప్పారు. అలాగే సెప్టెంబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు నమోదైన 22 కేసుల్లో 43 మంది బాధితులకు రూ. 46.62 లక్షలు ఆర్థిక సాయంగా పంపిణీ చేసినట్లు వివరించారు. సఫాయి కర్మచారుల సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహానంది దేవస్థానంలో ఔట్‌సోర్సింగ్ స్కావెంజర్లకు వేతనాల చెల్లింపులో ఉన్న సమస్యలు ప్రతి సమావేశంలోను పునరావృతమవుతోందని పేర్కొంటూ, కార్మికులకు రక్షణ పరికరాల పంపిణీ, విధి సమయాల అమలు వంటి అంశాలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్మికులకు తాగునీటి సౌకర్యం సహా ఇతర ప్రాథమిక వసతులు అందుబాటులో ఉన్నాయని యాజమాన్యం వెల్లడించిందని, అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే సఫాయి కర్మచారులకు బ్లౌజులు, మాస్కులు, సబ్బులు, ఆయిల్, చెప్పులు వంటి రక్షణ సామగ్రిని తప్పనిసరిగా అందించాలంటూ సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో బాధితులు ముందుకు రావడానికి అవగాహన పెంపు అవసరమని పేర్కొన్నారు. పోలీసులకు తెలిసిన ప్రతి కేసును క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అంగన్వాడీ టీచర్లపై ఎటువంటి వేధింపులకు పాల్పడలేదు

## విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం - సిడిపిఓ మద్దమ్మ



**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు జిల్లా ఆస్పరి ప్రాజెక్ట్ పరిధిలోని పనిచేస్తున్న అంగన్ వాడి టీచర్లను వేధిస్తున్నట్లు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఐ.సి.డి.యస్ సిడిపిఓ మద్దమ్మ పేర్కొన్నారు.

**"అంగన్వాడి టీచర్లను వేధిస్తున్న ఆస్పరి ఐసిడిఎస్ మద్దమ్మ" అనే**

**శీర్షికతో ప్రచురితమైన వార్త అవాస్తమని పేర్కొన్నారు.** ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్ వాడి కేంద్రములు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ఒక అంగన వాడి టీచర్ తీవ్ర మానసిక వేదనతో అనారోగ్యం పాలైందని వార్త గురించి ఆమె మాట్లాడుతూ దేవనకొండ మండలం కప్పట్రాల్ల 2 టీచర్ యం.లక్ష్మీదేవి కప్పట్రాళ్ళ గ్రామములో నివసించడం లేదని ఎమ్మిగనూరు మండలం నందు నివసిస్తూ రోజు ఎమ్మిగనూరు నుండి కప్పట్రాల్ల గ్రామమునకు తిరుగుతూ విధులను నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. సంబంధిత అంగన్వాడి టీచర్ విధుల పట్ల నిర్లక్ష్య వైకరితొ ఉన్నారని, విధులు సరిగ్గా నిర్వహించడం లేదని అనేక మార్లు మెమోలు ఇవ్వడం జరిగిందన్నారు. అయిన ఆమెలో ఎటువంటి మార్పులు రాలేదని అందుకు గాను షోకాజ్ నోటీస్ జారి చేసామని ఆ తర్వతా ఈ వార్తను ప్రచారం చెయ్యడం జరిగిందన్నారు. సంబంధిత టీచర్ ని తాను మానసికంగా వేధించలేదని కేవలం నిరాధార ఆరోపణలు చేశారని తెలిపారు.

# ఆటో ప్రమాదం- ఆటో డ్రైవర్ మధు మృతి.



**నగర పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు లేవు.**
**దూర ప్రాంతాలకు వ్యవసాయ పనులకు ఆటోలలో ప్రయాణాలు - ప్రమాదాలు.**
**మృతుడు ఆటో డ్రైవర్ మధు కుటుంబాన్ని ఆదుకోవాలి.**
**గాయాలపాలైన పేద మహిళలను ప్రభుత్వం ఆదుకోవాలి.**
**బేతంచెర్ల నగర పంచాయతీ లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి ప్రమాదాలను నివారించాలి.**
**సిపిఎం పార్టి పట్టణ మండల కమిటిల కార్యదర్శులు వైబి వెంకటేశ్వర్లు, ఎం. మధుశేఖర్ డిమాండ్.**

**బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నంది పత్రిక).** బేతంచెర్ల నగర పంచాయతీ అయినందువలన దాదాపు రెండువేల మంది పైగా వ్యవసాయ కూలీలకు, పేద మహిళలకు ఉపాధి లేక ఇతర మండలాలైన ఓర్వకల్లు, బనగానపల్లె,పాణ్యం అవుకు,కోవెలకుంట్ల, నంద్యాల తదితర మండలాలలోని గ్రామాలలో కూలి పనులు చేయడానికి పేద మహిళలు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో ఆటో, బొలెరో వాహనాలలో వెళ్లి,చామంతి, బంతి పూలు,మిర్చి, పత్తి,మొక్కజొన్న ఉల్లి, బత్తాయి తదితర పనులు చేసుకొని, తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చే పరిస్థితి ఉంది. ప్రస్తుతం శుక్రవారం ఉదయం జరిగిన ఆటో ప్రమాదం అందుకు సంబంధించినదే అని బేతంచర్ల నగర పంచాయతీలో ఉపాధి పనులు కల్పించి ఉంటే ఆటో ప్రమాదంలో మహిళ లకు తీవ్ర గాయాలు కావడం, ఆటో డ్రైవరు బలపాలపల్లె మధు 22 సం.లు) మరణించేవాడు కాదని సిపిఎం పార్టీ పట్టణ మండల కార్యదర్శులు వైబి.వెంకటేశ్వర్లు ఎం. మధు శేఖర్, సీనియర్ నాయకులు లంకా సుబ్బారాయుడు, జి. వేణు గోపాల్ అన్నారు. సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బేతంచెర్ల నగర పంచాయతీ కాక మునుపు, బేతంచెర్ల పట్టణంలో దాదాపు 3 వేలమంది, మరియు బుగ్గానిపల్లె గ్రామం లో,వెయ్యి మందికి పైగా ఉపాధి పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకునేవారు. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం బేతంచెర్ల మరియు బుగ్గానిపల్లె గ్రామాన్ని కలుపుకొని నగర పంచాయతీ చేసినందువల్ల, బేతంచెర్ల, బుగ్గానిపల్లె లో దాదాపు నాలుగు వేల మందికి పైగా ఉపాధి కోల్పోయారు. కూలి పనులు చేసుకొని కుటుంబాలను పోషించుకునే పేద మహిళా, వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకక, ఇతర మండలాలకు నూరు ,2వందల రూపాయల కూలి కొరకు, సుదూర మండలాలకు వెళ్లి,నిత్యం ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదమని తెలిసినా ఆటో సామర్థ్యానికి మించి ప్రయాణం చేసి పనులు చేసుకుని



తిరిగి వచ్చే పరిస్థితి ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి వి బి జి రామ్ జి పథకానికి ప్రవేశపెట్టి పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని రద్దు చేసిందని అన్నారు. ఈ వి బి జి రామ్ జి పథకంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం 40% అలాగే కేంద్ర ప్రభుత్వం 60% కలిపి ఉపాధి పనులు జరిపించే విధంగా చట్టం చేయడం దారుణం అన్నారు. గతంలో 10% రాష్ట్ర ప్రభుత్వం 90% కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఉపాధి వేతనాలు చెల్లించే పరిస్థితి ఉండేది. వి బి జి రామ్ జి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 40% పనులకు వేతనాలు చెల్లిస్తేనే గాని, కేంద్ర ప్రభుత్వం మిగతా 60 శాతం అమలు చేస్తామని చట్టం చేయడం చాలా దుర్మార్గమని వారన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు ఆలోచించి, నగర పంచాయతీలలో ఉపాధి కూలీలకు పనులు కల్పించి ఆదుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో జె. శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయ 33వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 27 ( నంది పత్రిక )** నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఆలయ 33వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలు ఈనెల 23వ తేది నుండి 27వ తేదీ వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజు ఏకాదశీలు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, కలశపూజలు, అర్చనలు, హోమాలు, గ్రామరక్ష పూజలు, గ్రామనాభిపూజలు, కుష్మాండ ప్రధానములు, శాంతి హోమాలు నిర్వహించారు. ఉదయం 10.45 గంటల నుండి పూర్ణాహుతి, కలశాధ్వాసనములు, మార్జనలు, కంకణా విసర్జనలు, తీర్థప్రసాద వినియోగములు ఆశీర్వాచనలు, ఫలప్రదాన కార్యక్రమాలు జరిపారు. 12గంటల కు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమమలు, సాయంత్రం తర్వాత గరుడసేవా, గ్రామోత్సవం వైభంగా నిర్వహించారు. ఈ ముగింపు ఉత్సవ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి,గ్రామస్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.



# మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

## పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
## బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలి

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 27(నంది పత్రిక):-** జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఎన్‌కోర్డ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంపై ఏవైనా ఫిర్యాదులు వచ్చాయా అనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఎక్సైజ్, పోలీస్, విద్యాశాఖల సమన్వయంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. యువతను రక్షించేందుకు తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్య కమిటీలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నాటు సారా తయారీ జరుగుతున్న చెంచు తాండాలు మరియు మారుమూల గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి, ఆ కుటుంబాలను నాటు సారా తయారీ నుండి పూర్తిగా విముక్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా నందికొట్కూరు మండలంలోని షికారు కాలనీ వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించి అక్రమ మద్యం తయారీని పూర్తిగా నివారించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను ఇతర ప్రాంతాలకు తరలించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సునీల్




షోరాణ్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి అక్రమంగా దిగుమతి అవుతున్న గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతోందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మత్తు పదార్థాల విక్రయాలపై దాడులు కొనసాగిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలు లభ్యమవుతున్న ప్రదేశాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ యుగంధర్ బాబు, ఎక్సైజ్, పోలీస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీఈవో, ఐసిడిఎస్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'సెట్' (స్పెషల్ ఎంక్వయిరీ టీమ్) పోస్టర్ మరియు ట్రైలర్ ను విడుదల చేసిన ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 27 ( నంది పత్రిక )** నంద్యాల టిడిపి కార్యాలయంలో స్మార్ట్ సిటీ నంద్యాల వారి ఆధ్వర్యంలో రూపొందిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్/షార్ట్ ఫిల్మ్ 'సెట్' (స్పెషల్ ఎంక్వయిరీ టీమ్) పోస్టర్ మరియు ట్రైలర్‌ను నంద్యాల తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల యువత ప్రతిభను చాటుతూ సమాజంలో జరుగుతున్న అక్రమాలపై అవగాహన కల్పించే ఇలాంటి చిత్రాలను నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో పెను సవాలుగా మారిన "దొంగనోట్ల చెలామణి" అనే కాన్సెప్ట్ చుట్టూ ఈ కథ తిరుగుతుందని . దొంగనోట్ల వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆ నెట్‌వర్క్ వెనుక ఉన్న ముఠాను హీరో మరియు అతని స్పెషల్ ఎంక్వైరీ టీమ్ (సెట్ ) ఎలా పట్టుకొని శిక్షించారనేది ఈ చిత్ర ప్రధానాంశం అని తెలిపారు అనంతరం చిత్ర యూనిట్‌కు ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రం మార్చి 6, 2026 న విడుదల కానుందని . పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ప్రేక్షకులు ట్రైలర్‌ను వీక్షించవచ్చు అని . విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు ఈ కార్యక్రమంలో వెబ్ సిరీస్ హీరో నవీన్ జెబి, హీరోయిన్ క్యాథరిన్, విలన్ లిఖిత్, కథ – స్క్రీన్ ప్లే – మాటలు – దర్శకత్వం: వయొలెన్స్ వంశీ, నిర్మాత మరియు సినిమాటోగ్రఫీ (డిఓపి) యాంగ్రీమన్ ప్రణయ్ , స్మార్ట్ సిటీ నంద్యాల బంటి , అమీర్ తదితరులు పాల్గొన్నారు




# నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం వేసవిలో విద్యుత్ సమస్యలకు చెక్

**బద్వేల్, ఫిబ్రవరి 27( నంది పత్రిక ):**నేడు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్ ప్రాంతంలో అదనంగా నిర్మించిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, స్థానిక ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా, లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రిబ్బన్ కట్ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అనంతరం, అక్కడి ప్రజలతో ముచ్చటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభివృద్ధి పనులకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంతో శివానగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుందని అధికారులు వెల్లడించారు.



# సృజన కోవెలలో 'దారం' అల్లిన అద్భుతం

## టైలర్స్ డే ప్రత్యేక కథనం



ప్రపంచం ఎంత నాగరికంగా మారినా, మనిషికి గౌరవాన్ని, అందాన్ని ఇచ్చేది వస్త్రం. ఆ వస్త్రాన్ని ఒక రూపం లేని గుడ్డ ముక్క నుండి అద్భుతమైన కళాఖండంగా మార్చే మాంత్రికుడే 'టైలర్'. ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జరుపుకునే 'వరల్డ్ టైలర్స్ డే' కేవలం ఒక వృత్తికి సంబంధించిన రోజు కాదు; అది శ్రమకు, సృజనాత్మకతకు మరియు సహనానికి ఇచ్చే గౌరవం. కుట్టు మిషన్‌ను కనిపెట్టి, కుట్టు వృత్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన విలియం ఎలియాస్ హోవే జన్మదినం సందర్భంగా ఈ రోజును జరుపుకుంటాం. ఆయన ఆవిష్కరణ లక్షలాది మందికి ఉపాధినివ్వడమే కాకుండా, మానవ నాగరికతలో దుస్తుల ప్రాముఖ్యతను మార్చివేసింది.

**ఒక దారం.. వేల భావాలు** టైలరింగ్ అంటే కేవలం బట్టలు కుట్టడం కాదు, అది ఒక నిశ్శబ్ద ప్రార్థన. సూది బెజ్జంలో దారం ఎక్కించేటప్పుడు ఉండే ఆ ఏకాగ్రత ఒక యోగి ధ్యానం లాంటిదిసూది. కొలతలు తీసుకోవడంలో ఒక మిల్లీమీటర్ తేడా వచ్చినా అంగీకరించని ఆ పట్టుదల ఒక ఇంజనీర్ పనితనాన్ని తలపిస్తుంది. పండగకైనా, పెళ్లికైనా ఒక వ్యక్తిని అందంగా చూపించాలనే తపనతో రాత్రంతా మేల్కొని కుట్టే ఆ కష్టంలో ఒక నిస్వార్థమైన సేవ దాగి ఉంది. "మనిషి పుట్టినప్పుడు దిగంబరి, చనిపోయినప్పుడు రిక్తహస్తం.. కానీ మధ్యలో మనిషికి గౌరవప్రదమైన రూపం ఇచ్చేది కుట్టు కళాకారుడే."

**ప్రార్థన పత్రికల కోసం ప్రత్యేక సందేశం** దేవుడు ఈ లోకాన్ని సృష్టించిన గొప్ప టైలర్. మన జీవితాలనే రంగురంగుల దారాలను ఆయన తన సంకల్పం అనే సూదితో ఎంతో అద్భుతంగా అల్లుతాడు. ఎక్కడ చిరుగులు ఉన్నా, ఎక్కడ అతుకులు అవసరమైనా ఆయనకు తెలుసు. కుట్టు కళాకారులు కూడా అదే దైవత్వంతో మనుషుల లోపాలను కప్పి ఉంచి, వారిని ఆత్మవిశ్వాసంతో ముస్తాబు చేస్తారు.

**నేటి ఆధునిక కాలంలో..** నేడు ఫ్యాషన్ డిజైనింగ్ ఎంత ఎదిగినా, ఒక చిన్న గల్లీలో కుట్టు మిషన్ శబ్దం చేస్తూ కష్టపడే టైలర్ దగ్గరే అసలైన కళ ఉంటుంది. వారు కేవలం బట్టలను అతికించడం లేదు, విడిపోయిన సంబంధాలను కలిపే దారంలా, సమాజంలో అందరినీ ఒక తాటిపైకి తెచ్చే సంస్కృతిని నిర్మిస్తున్నారు.


గతుకుల లోకాన అతుకులు వేస్తూ
అందరి రూపానికి మెరుగులు దిద్దేవు
నీ చక్రం తిరిగితేనే కదా లోకానికి నాగరికత..
నీ సూది సాగితేనే కదా మనిషికి ఘనత!
ముతక గుడ్డను ముచ్చటైన కళాఖండం చేస్తావు
కొలతలతోనే మనిషి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతావు
కంటి చూపును దారం చివరన నిలిపి
కండల శ్రమను చక్రం అంచున కలిపి..
ఎందరికో పండగ వెలుగులు పంచుతావు
కానీ నీ ఇంట్లో మాత్రం దీపం వెలిగేదాకా కుడుతూనే ఉంటావు
చిరుగులు లేని చిరునవ్వును లోకానికి అందిస్తూ
అలుపెరగని సృజనతో అద్భుతాలు అల్లుతూ..
ఓ అక్షర శిల్పికి కలం ఎంత బలమో
ఓ కుట్టు శిల్పికి నీ 'మెషిన్' అంత బలము
కళకు కులం లేదు.. కష్టానికి మతం లేదు
నీ కుట్టు అతుకులో విడిపోని బంధం ఉంది..
నీ వృత్తి ధర్మంలో సాటిలేని సేవ ఉంది!

ఈ టైలర్స్ డే సందర్భంగా, మనకు అందమైన దుస్తులు



అందిస్తున్న ప్రతి చేతికి వందనం చేద్దాం. వారి కళ్ళలో ఉండే అలసటను గుర్తిద్దాం, వారి నైపుణ్యాన్ని గౌరవిద్దాం. అతుకులు లేని జీవితం ఎవరికీ ఉండదు, కానీ ఆ అతుకులను కూడా ఒక డిజైన్‌లా మార్చగలిగే సృజనాత్మకత టైలర్‌ది! టైలర్స్ అందరికీ నంది పత్రిక తరపున అంతర్జాతీయ కుట్టు కళాకారుల దినోత్సవ శుభాకాంక్షలు!

సేకరణ: పి.వి. సురేంద్ర (రుద్రవరం ప్రతినిధి)



# ఘనంగా ఎలైట్ అల్యూమినియం ఇంటీరియర్స్ నూతన షాప్ ఓపెనింగ్

### టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం ఇంచార్జి గౌరు వెంకట రెడ్డి ,



కల్లూరు నంది పత్రిక.... కల్లూరు మండలం రేడియో స్టేషన్ ప్రక్కన ఎలైట్ అల్యూమినియం ఇంటీరియర్స్ నూతన షాప్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం ఇంచార్జి గౌరు వెంకట రెడ్డి , మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ , మరియు క్లస్టర్ ఇన్చార్జి జనార్ధన్ ఆచారి, 37 వ వార్డు ఇన్చార్జి సుతారు రాఘవేంద్ర , 41 వ వార్డు ఇన్చార్జి నాగేశ్వరరావు , మరియు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పదో తరగతి విద్యార్థులకు మహర్షి స్కూల్ ఘన వీడ్కోలు



### పాటలు, నృత్యాలు, స్కిట్లతో అలరించిన విద్యార్థులు

పోరుమామిళ్ల,ఫిబ్రవరి 27(నంది పత్రిక ): పోరుమామిళ్లలోని మహర్షి స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికే ఫేర్వెల్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. విద్యా విలువలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చే మహర్షి స్కూల్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలు, స్కిట్లతో ప్రేక్షకులను అలరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్ విజయాలకు దోహదపడే సూచనలు చేశారు.

**ఈ సందర్భంగా మాట్లాడిన ఉపాధ్యాయులు,** "పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించగలుగుతారు. పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇచ్చే మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు" అని సూచించారు.అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ తన పద్యాలు, ప్రేరణాత్మక మాటలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. "జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడటం అలవాటు చేసుకోవాలి. చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్ణయించుకుని, నిరంతర సాధనతో ముందుకు సాగితే ఏ శిఖరమైనా చేరుకోవచ్చు" అంటూ విద్యార్థుల భవిష్యత్తుపై ఆశాజనకమైన సందేశాన్ని అందించారు.త్వరలో జరగనున్న టెన్త్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు రోజూ క్రమంగా చదువుకోవాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అనవసర ఆందోళనలకు లోనుకాకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రశాంత మనస్సుతో పరీక్షలకు సిద్ధమవ్వాలని తెలిపారు. ఈ ఫేర్వెల్ డే కార్యక్రమం విద్యార్థుల జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు గురుమోహన్, భాస్కర్,ప్రధానోపాధ్యాయులు (హెడ్ మాస్టర్) బాల ఓబయ్య,ఇన్‌చార్జ్ ఈశ్వర్ రెడ్డి,ముఖ్య అతిథి (సీఐ) హేమ సుందర రావు, ఎం.ఈ.ఓ కొండిశెట్టి,ఏ.ఈ.ఎం మహేష్ కుమార్,ఎం.పీ.డీఓ ఉపేంద్ర రెడ్డి,స్కూల్ అసిస్టెంట్లు బాల రాజు, దాదాపీర్,గోల్డ్ స్టూడెంట్ & గ్రూప్2 అధికారి సృజనతో పాటుఅతిథులుగా చెన్నయ్య, రవీంద్ర బాబు, కృష్ణా రెడ్డి, నారాయణ రెడ్డి, బాల సుందరం, రవి, జేమ్స్, కుమార్, చంద్రహాస్ రెడ్డి, రామ గోపాల్ రెడ్డి, పుల్లయ్య, గురయ్య, సురేంద్రనాథ్ రెడ్డి, బాలుడు, శ్రీధర్ పాల్గొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సాంస్కృతిక అభిరుచులు పెంపొందించడంలో మహర్షి స్కూల్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.



# మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.35 లక్షలు



మహానంది ఫిబ్రవరి 27 (నంది పత్రిక):- మహానంది పుణ్యక్షేత్రంలో ఉభయ దేవాలయాల హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించగా మహానందీశ్వర స్వామివారికి రూ.35,05,573 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎన్. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ శుక్రవారం అభిషేక మండపంలో శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారి హుండీతో పాటు ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపు పక్రియ చేపట్టమన్నారు.హుండీ ఆదాయం ద్వారా రూ.34,64,108, గో సంరక్షణ ద్వారా రూ.16,825, నిత్య అన్నదానంకు రూ.24640, మొత్తం 27 రోజులకు గాను రూ. 35,05,573 ఆదాయం వచ్చిందన్నారు. వీటితోపాటు కరెన్సీ యూఎస్ఏ 1,డాలర్ 2 వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల దేవాదాయ ధర్మాదాయ శాఖ డీఈవో ఎస్ మోహన్,ఏఈఓ మధు, స్వచ్ఛంద సేవకులు,దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జి రాంజీ పథకం ద్వారా అర్హులకు ఉపాధి..

### ఎంపీడీవో గోపికృష్ణ

జూపాడుబంగ్లా ఫిబ్రవరి27: (నంది పత్రిక): గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఉపాధి కల్పించేలా జి రామ్ జి ఉపాధి హామీ పథకం 100 రోజులు పనులను 125 రోజులకు ప్రభుత్వం పెంచిందని ఎంపీడీవో గోపికృష్ణ అన్నారు. అనంతరం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో విబి జి రామ్ జి పోస్టర్లను ఎంపీడీవో గోపికృష్ణ, ఏపీవో రేష్మ, ఈసీ అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో అందరికీ ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. వికాస్ భరత్ జి రామ్ పథకం ద్వారా ఎక్కువ పనులను చేసుకుని శ్రామిక జీవన ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. కొత్త చట్టం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి పథకాన్ని వందరోజుల నుండి 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. నీటి భద్రత సంరక్షణ సంబంధించిన పనులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులు, జీవనోపాధి పెరుగుదల పనులు వాతావరణ మార్పులు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదుర్కొనే పనులు కలవన్నారు. ఈ పథకం పై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు ఒక ఆర్థిక సంవత్సరంలో నైపుణ్యం లేని శ్రామికులకు 125 రోజుల పని దినాలను కల్పించబోతున్నారని అన్నారు. వికసిత్ భారత గ్రామీణ పోర్టల్ నందు కనపడుతాయని వీటిని ఎవరైనా వీక్షించవచ్చునని అన్నారు. వ్యవసాయ సీజన్లో రైతులకు శ్రామికులకు అందుబాటులో ఉండే విధంగా 60 రోజుల విరామం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామీణ చట్టం ద్వారా ప్రజలకు రైతులకు అవగాహన పెంచేలా ఆరువారాలపాటు ప్రజా చైతన్య కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఫిబ్రవరి నెల 27 నుండి మార్చి 25 వరకు జరిగే చైతన్య కార్యక్రమాలలో వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గ్రామ స్థాయిలో సామూహిక ప్రతిజ్ఞలు, రచ్చబండపై గ్రామస్థాయి సమావేశాలు, కొత్త చట్టంపై ప్రజా ప్రతినిధులతో చర్చా కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని అన్నారు. విబి జి రాంజీ జిచట్టం పై ప్రతి గ్రామపంచాయతీలలో షెడ్యూల్ ప్రకారం తేదీల్లో అవగాహన కార్యక్రమాలు ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు.



# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ఏర్పాటు....



నంద్యాల క్రైం, ఫిబ్రవరి27(నంది పత్రిక):- పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ను శుక్రవారం నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. నంద్యాల జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 08 మంది పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ వారి యొక్క సమస్యల గురించి ఎస్పీ తెలియచేసినారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియ చేసినారు.

# వైసిపి కార్యకర్తకు ఆర్థిక సహాయం అందించిన చైర్మన్ చలం రెడ్డి.



బేతంచెర్ల ఫిబ్రవరి 27 ( నందిపత్రిక ). బేతంచర్ల పట్టణంలోగల సంజీవ నగర్ కాలనీ చెందిన వైసీపీ కార్యకర్త నాయిని రంగస్వామి కాలికి ఇన్ఫెక్షన్ అయ్యి, ఇబ్బంది పడుతున్నది తెలుసుకున్న బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి 10 వేల రూపాయలు ఆర్థిక సాయం శుక్రవారం అంద చేశారు.వైసిపి నాయకులతో కలిసి నాయిని రంగస్వామి ఇంటి దగ్గరికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేయడ మైనది.ఈ కార్యక్రమంలో సంజీవ నగర్ వైసిపి నాయకులు తలారి రామనాయుడు,నిరంజన్, ఎర్రగుంట్ల రాజు,చౌడప్ప,నాగరాజు,ఆనందు,ప్రభాకర్ రెడ్డి,లోడింగ్ ఎర్రమల,రంగనాయకులు, యాదరాల మద్దిలేటి, యాదరాల శీను,ఉరుకుందు పాల్గొన్నారు.

# బేతంచెర్ల లో రెండు బైకులు ఢీ.

### నయరా పెట్రోల్ బంక్ (డోన్ రోడ్) సమీపాన ప్రమాదం



బేతంచెర్లఫిబ్రవరి 27 ( నందిపత్రిక). బేతంచర్ల పట్టణంలోని డోన్ రోడ్ లోగల నయారా పెట్రోల్ బంకు సమీపంలో ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. బేతంచెర్ల మండల పరిధిలోని హెచ్. కొట్టాల గ్రామానికి చెందిన వ్యక్తి బైకుపై వెళుతుండగా, డోన్ వైపు నుంచి బేతంచర్లకు వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆరోగ్యంగా ఉంటేనే విధులలో నాణ్యమైన పనితనాన్ని కనపరచగలం





**ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాలను వీఆర్వో, వీఆర్ఏలు తప్పనిసరిగా వినియోగించుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 27 నంది పత్రిక** జిల్లా కలెక్టర్ శుక్రవారం భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వీఆర్వో, వీఆర్ఏల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, తద్వారా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి పెద్ద సమస్యలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్డీవోలు, తహసిల్దార్లు పరిధిలోని ఉద్యోగులకు వారి పరిధిలోని ఏరియా ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు. ముందుగా వీఆర్వో, వీఆర్ఏలు అందరూ ఈ పరీక్షా కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల్లో జనరల్ చెకప్‌తో పాటు డయాబెటిస్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, హీరింగ్ సమస్యలు ఉన్నవారిని తదుపరి చికిత్స కోసం రిఫర్ చేస్తామని తెలిపారు. ఇటువంటి శిబిరాల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించుకోవచ్చని పేర్కొన్నారు.

ఉద్యోగులకు పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని వైద్య అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగుల ఆరోగ్యం బాగుంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని తెలిపారు. అందువల్ల రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎం.శివన్నారాయణ రెడ్డి, ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాలను బలోపేతం చేయండి : చిలక రాబిన్సన్ మాదిగ.

**ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం.**



**నందికొట్కూరు ఫిబ్రవరి 27( నంది పత్రిక )** ఎమ్మార్పీఎస్ నాయకులు జాతి ఉద్యమ బిడ్డలు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంద సంఘాలను బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలక రాబిన్సన్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం నందు నందికొట్కూర్ ఎం ఎస్ పి ఇన్చార్జ్ జిల్లా అధికార ప్రతినిధి కోట ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన నియోజవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలక రాబిన్సన్ మాదిగ, నంద్యాల జిల్లాకు ఇంచార్జ్ కోలా కళ్యాణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివ నారాయణ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు భాష పోగు దర్గయ్య లు హాజరయ్యారు.ఈ సమావేశం లో నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఎంఎస్పి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం సీనియర్ నాయకులు పి దేవన్న మాదిగ,పగడం రాఘవ మాదిగ,నాగటూరు సుధాకర్ మాదిగ,గద్దల వెంకటరత్నం మాదిగ , బోరెల్లి ప్రకాశం మాదిగ జడల శ్రీనివాస్ మాదిగ, కే మోహన్ మాదిగ, దామగట్ల జయపాల్, వివిధ మండలల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కాటేపోగు జాన్, బోల్లెద్దుల మోహన్,మిడ్తూరు మండల ఇంచార్జ్ సతీష్, మండల ఎంఎస్పి అధ్యక్షుడు గోపాల వెంకటరమణ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గద్దల ఆనంద్, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కనకంమర్రి స్వామి మరియు వివిధ మండలాల గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏకీకృత కుటుంబ సర్వే రేపు ఫిబ్రవరి 28 నాటికీ నూరు శాతం ప్రగతి సాధించాలి.

**ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి. - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**





**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 27 నందిపత్రిక** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం ఏకీకృత కుటుంబ సర్వే ప్రగతి పై ఎంపీడీవోలు, జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బందితో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గూగుల్ మీట్ ద్వారా మండలాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏకీకృత కుటుంబ సర్వే 28వ తేదీ సాయంత్రానికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. యు.ఎఫ్.ఎస్ సర్వేపై నిరంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న సర్వేలో ప్రగతి సాధించకపోవడంపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా మండలాలలో పర్యటించి యు.ఎఫ్ ఎస్ సర్వే పై సమీక్షించడం జరిగిందన్నారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో ఉండి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏకీకృత కుటుంబ సర్వే ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉండడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. యు ఎఫ్ ఎస్ సర్వే లక్ష్య సాధనలో వెనుకబడిన మండలాల ఎంపీడీవోలు, సంబంధిత సిబ్బందితో నేరుగా మాట్లాడి ఉదయం 7 గంటల నుండి సర్వే ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగించి 28వ తేదీ సాయంత్రం నాటికి సర్వే నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సర్వే పూర్తి అయ్యేంతవరకు అత్యవసర పరిస్థితులలో తప్ప ఎవరికీ సెలవులు మంజూరు చేయవద్దని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్లో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసి రెడ్డి, జిల్లాలోని ఎంపీడీవోలు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా విస్తృత చర్యలు చేపట్టాలి



**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సహకార శాఖలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 671 పిఏసిఎస్ లు ఉన్నాయని, వీటిలో 666 సొసైటీలను అప్డేట్ చేయడం జరిగిందన్నారు, మిగిలిన ఐదు సొసైటీలను వారం రోజుల్లోపుగా అప్డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లాకు నాబార్డ్ మంజూరు చేసిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 24 మల్టీ పర్పస్ గోడౌన్స్ లో 14 పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 10 గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి పూర్తయిన 14 గోడౌన్లు వాడ్రా రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేసి, పిఏసిఎస్ లకు అప్పగించడం జరిగిందన్నారు. ఇప్పటికే పూర్తయిన గోడౌన్లను తక్షణమే వినియోగంలో తీసుకురావాలని ఆదేశించారు. కౌలు రైతులకు డిసిసిబి బ్యాంక్ విస్తృతంగా పంట రుణాలు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలను అత్యున్నత సంస్థలకు, గ్రామాలను, నగరాలకు, మండలాలను, ప్రపంచ మార్కెట్లకు, రాష్ట్ర డేటాబేస్‌లను, అంతర్జాతీయ డేటాబేస్‌లకు అనుసంధానించడంలో డేటాబేస్ ప్రధాన పాత్ర పోషిస్తుందని, తద్వారా సహకార సంస్థల విస్తరణను ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. సహకార సంస్థల ద్వారా భారతదేశంలో నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిని పెంచడంలో భారతీయ బీజ్ సహకార సమితి లిమిటెడ్ (బిబిఎస్ఎస్ఎల్) సహాయం చేస్తుందన్నారు. దీని వలన దిగుమతి చేసుకున్న విత్తనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం అందించడం జరుగుతుందన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాలు రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రతి పంచాయతీ, గ్రామాన్ని కవర్ చేస్తూ 2 లక్షల కొత్త బహుళార్థసాధక పిఏసిఎస్ లు గా కానీ, లేదా ప్రాథమిక పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. నేషనల్ కోపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ లో సభ్యత్వం పొందడానికి జిల్లా నుండి 38 సొసైటీలు దరఖాస్తు చేసుకోగా, 12 సొసైటీలు మెంబర్ షిప్ ను అందుకోవడం జరిగిందన్నారు. అలాగే బి బి ఎస్ ఎస్ ఎల్ లో 121 సొసైటీలు సభ్యత్వం సభ్యత్వం పొందడం జరిగిందని, ఎన్సీఈఎల్ లో 22 సొసైటీలు సభ్యత్వం పొందాయని తెలిపారు. దీని ద్వారా మన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో ఆదాయాన్ని పెంచుకోవడానికి వీలవుతుంది అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం కౌలు రైతుల రుణాల మంజూరులో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా 159 కౌలు రైతులకు సొసైటీలో చేర్పించి రూ.18.49 లక్షల పంటల రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ ఎడి కేఏఎస్ఎస్ శ్రీనివాస్, మత్స్య శాఖ జెడి ఆర్.కోటి లింగరాజు, నాబార్డ్ డీడియం నిష్యంత్, డిసిసిబి సీఈవో పి.సింహాచలం, ఎఫ్సీఐ అధికారి పి.ఆనంద్, సెంట్రల్ వేర్ హౌసింగ్ అధికారి పి.వేణు, ఆప్కాబ్ డిపిడిఎం, మార్కెటింగ్ శాఖ డిఈ సిహెచ్ సాయి రామారావు, డీఎస్ఓ సరోజ, ఎఫ్సీఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .



## మైక్రో ఆర్టిస్ట్ రాఘవేంద్ర బాబును అభినందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 27 నందిపత్రిక** పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కోడూరి రాఘవేంద్ర బాబు మైక్రోఆర్ట్ తో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేరును చాక్ పీస్ పై చెక్కి శుక్రవారం కలెక్టరేట్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ ను కలిసి ఆ చాక్ పీస్ ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైక్రో ఆర్ట్ తో అద్భుతంగా తన పేరును చెక్కడం చాలా సంతోషంగా ఉందని రాఘవేంద్ర బాబును కలెక్టర్ అభినందించారు. తాను మంత్రులకు, శాసనసభ్యులకు, ప్రముఖులకు మైక్రో ఆర్ట్ తో చాక్ పీస్ ల పై పేర్లు చెక్కి అందిస్తుంటానని కలెక్టర్ కు తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేరుని కూడా చాక్ పీస్ పై చెక్కి ఈరోజు అందజేసినట్లు రాఘవేంద్ర బాబు తెలిపారు.

# నేడే (ఫిబ్రవరి 28) పీఎం లంకలో సాంప్రదాయ మత్స్యకారులకు 100 పడవలు, వలలు ఉచితంగా పంపిణీ

**రామకృష్ణ మిషన్ తొలి విడతగా సమకూర్చిన రూ.70 లక్షలతో పడవలు తయారీ పూర్తి**

**మొంథా తుఫానుతో పడవలు, వలలు కోల్పోయిన వంద మంది పేద సాంప్రదాయ మత్స్యకారులకు చేకూరనున్న ప్రయోజనం**

**పేద సాంప్రదాయ జాలర్లకు జీవనోపాధి పెంపొందించే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కృషి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 27, నంది పత్రిక** మొంథా తుఫానుతో పడవలు, వలలు కోల్పోయిన జిల్లాకు చెందిన పేద మత్స్యకార కుటుంబాలకు ఊరట కలిగించేందుకు రామకృష్ణ మిషన్ నిధులతో తయారుచేసిన బోట్స్ ను రేపు శనివారం పీఎం లంకలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం మొగల్తూరు, నర్సాపురం మండలాలకు చెందిన దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) ఉన్న సాంప్రదాయ జాలర్ల కుటుంబాలుకు పడవలు, వలలను రేపు శనివారం పీఎం లంకలో నిర్వహించే కార్యక్రమంలో ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. 300 మంది పేద మత్స్యకారులకు రూ.2.10 కోట్ల విలువైన పడవలు, వలలను పూర్తిగా ఉచితంగా అందించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం జరిగింది. దీనిలో భాగంగా తొలిదశలో 100 మంది లబ్ధిదారులకు సుమారు రూ.70 లక్షల విలువైన సామగ్రిని అందజేయడానికి రామకృష్ణ మిషన్ నిధులను సమకూర్చడం జరిగిందని తెలిపారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బలంగా తయారు చేసిన పడవలు, నాణ్యమైన వలలు అందించడంతో మత్స్యకారులు తిరిగి స్వావలంబన సాధించగలరని అన్నారు. జిల్లా కలెక్టర్, రామకృష్ణ మిషన్ ప్రతినిధి పర్యవేక్షణలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయడం జరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2025 డిసెంబర్ 28న పీఎం లంక పర్యటనకు వచ్చిన సందర్భంలో తయారీలో ఉన్న బోట్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పేద మత్స్యకారులకు బోట్లు సమకూర్చేందుకు రామకృష్ణ మిషన్ ప్రతినిధులతో మాట్లాడి 100 మంది మత్స్యకారులకు బోట్లు అందజేయడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ ను కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. మొంథా తుఫానుతో పడవలు, వలలు కోల్పోయిన పేద మత్స్యకారులు ఆర్థిక వనరుల కొరతతో పడవలు మరియు చేపల వలలను కొనుగోలు చేయలేకపోతున్నారన్న విషయం జిల్లా యంత్రాంగం గుర్తించింది. దీనివల్ల, స్వతంత్రంగా చేపల వేట కొనసాగించాల్సిన జాలర్లు రోజువారీ కూలీ కార్మికులుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రభుత్వ సామాజిక సంక్షేమ పథకాలు అమల్లో ఉన్నప్పటికీ, ఈ కుటుంబాల ఆర్థిక స్థితి ఇంకా బలహీనంగానే ఉండటం, అదనంగా క్రమబద్ధమైన ఆదాయం లేకపోవడం మరియు పోషకాహారానికి పరిమిత ఉండటం వల్ల కుటుంబ సభ్యుల్లో పోషకాహార లోప సమస్యలు విస్తృతంగా కనిపిస్తున్నాయని గ్రహించడం జరిగిందన్నారు. సాంప్రదాయ వృత్తిని కొనసాగించడానికి అవసరమైన జీవనోపాధి ఆస్తులు లేకపోవడం వారి సామాజిక-ఆర్థిక ఇబ్బందులను మరింత తీవ్రమయ్యేలా చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రాజమండ్రిలోని రామకృష్ణ మిషన్ కు మత్స్యకారుల పరిస్థితులను వివరించడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి మొగల్తూరు, నర్సాపురం మండలాలకు చెందిన 100 మంది సాంప్రదాయ జాలర్ల కుటుంబాలకు ఒక్కో పడవ మరియు ఒక్కో ఫిషింగ్ వలను అందజేయడానికి ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ చర్య ద్వారా లబ్ధిదారులు తమ స్వంతంగా చేపల వేటను పునఃప్రారంభించి స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశాలు మెరుగు పడనున్నట్లు తెలిపారు. పేద సాంప్రదాయ జాలర్లకు జీవనోపాధి ఆస్తుల అందజేత, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, కుటుంబాల ఆర్థిక స్థిరీకరణ, పోషకాహార లోప సమస్యల తగ్గింపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జాలర్ల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, వారి సాంప్రదాయ వృత్తికి పునరుజ్జీవం లభించనుందని జిల్లా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు..



# ప్రేమ పెళ్లిపై సోదరుడి కర్కశం

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడిపై హత్యాయత్నం జరిగింది. తన చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని యువకుడిపై ఓ వ్యక్తి చంపేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో చోటుచేసుకుంది. ప్రస్తుతం బాధితుడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్‌లోని నేరెడ్‌మెట్ ప్రాంతానికి చెందిన అజయ్, రామలింగంపల్లికి చెందిన యువతి గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇటీవల మూడు రోజుల క్రితం వీరిద్దరు వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో అజయ్‌పై యువతి సోదరుడు పగ పెంచుకున్నాడు. బుధవారం యువతి మొబైల్ నుంచి రామలింగంపల్లికి రావాలంటూ అజయ్‌కి ఆమె సోదరుడు మెసేజ్ చేశాడు. తనను తన ప్రియురాలే పిలిచిందని భావించిన అజయ్ రామలింగంపల్లికి వెళ్లాడు. ఆ గ్రామ శివార్లలోకి రాగానే యువతి సోదరుడు అజయ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. యువతి సోదరుడు, అతని స్నేహితులు అజయ్ కళ్లలో కారం చల్లి... అనంతరం కత్తులతో దాడి చేశారు. అజయ్‌పై 14 సార్లు కత్తితో దాడికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో పడిపోవడంతో చనిపోయాడని భావించి అక్కడి నుండి వెళ్ళిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అజయ్‌ని గాంధీకి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లాలో ఆహార తనిఖీలను విస్తృతంగా చేపట్టాలి

**కల్తీ ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు**
**కల్తీ కారణంగా ఎంతో మంది వ్యాధులకు గురవుతున్నారు..**
**ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధించబడుతున్నారు**
**వ్యాపారులు ప్రజలను కూడా వారి కుటుంబ సభ్యులులాగా భావించాలి.. నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 27, నంది పత్రిక కల్తీకి కారణమైన ప్రతి ఒక్కరిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు అని, తగిన చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి, పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశమై గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న కల్తీ ఆహార పదార్థాల తనిఖీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కల్తీ పాలను, నెయ్యి, వెన్న ఎలా గుర్తిస్తున్నారు, శాంపిల్స్ ఎక్కడ పంపిస్తున్నారు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ ఆహార భద్రత తనిఖీలను నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ అని తేలితే చట్టపరంగా కఠినమైన చర్యలకు బాధ్యులను చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో ఎవరిని ఉపేక్షించవద్దని గట్టిగా హెచ్చరించారు. సమావేశం అనంతరం జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి ఎ.సుందర్ రామిరెడ్డి భీమవరం పట్టణంలోని పాల కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది. దీనిలో భాగంగా శ్రీనివాస సెంటర్, డిఎన్ఆర్ కాలేజ్ రోడ్ నందలి పాల కేంద్రంలో వద్ద పాలను తనిఖీ చేసి

అవి కల్తీ కలిగిన పాలుగా గుర్తించి వాటిని ఎ.పి స్టేట్ ఫుడ్ సేఫ్టీ లాభారటరీ కి పంపించడం జరిగినది. ఆ శాంపిల్స్ యొక్క స్థితి వెలువడిన వెంటనే సంబంధిత వ్యాపారస్తుపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి ఎ.సుందర్ రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కోటి లింగరాజు, తదితరులు.

## శ్రీశైలం దేవస్థానంలో బంగారు రుద్రాక్షమాల, హారం విరాళం



శ్రీశైలం ఫిబ్రవరి 27(నంది పత్రిక) శ్రీ కూరపాటి మాధవి మరియు కుటుంబసభ్యులు, బాపట్ల వారు బంగారు రుద్రాక్షమాల మరియు బంగారు హారాన్ని దేవస్థానమునకు సమర్పించారు. వీటిలో 43 గ్రాముల బంగారంతో రుద్రాక్షమాలతో పాటు త్రిశూలం, ఢమరుకం తయారు చేయించినట్లు తెలిపారు. అలాగే 30 గ్రాముల బంగారంతో హారాన్ని తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచనమండపంలో దాతలు ఈ వీటిని పర్యవేక్షకులు జి. రవికుమార్, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జునులకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

# శ్రీశైలం దేవస్థానంలోధార్మిక సదస్సు





శ్రీశైలం ఫిబ్రవరి 27 (నంది పత్రిక) దేవస్థానంలోని అన్నప్రసాదవితరణ భవనం వద్ద గల కమాండ్ కంట్రోల్ సముదాయంలోని సమావేశ మందిరంలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్.డి.పి.టి.) ఆధ్వర్యంలో ధార్మిక సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి యం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, శ్రీశైలదేవస్థానంతో పాటు కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల హెచ్.డి.పి.టి. కోఆర్డినేటర్లు, మరియు అర్చకుల సమాఖ్య వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేవస్థానంలో గిరిజన చెంచులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా చెంచులకు నెలకొకసారి ఉచితంగా శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పించే కార్యక్రమం గత ముక్కోటి ఏకాదశిన ప్రారంభించామన్నారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా హెచ్.డి.పి.టి. చేసే కార్యక్రమాలకు శ్రీశైలం దేవస్థానం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. స్వచ్ఛంద సేవకులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, ధర్మప్రచారం కోసం తగినంత సహాయ సహకారాలు దేవస్థానం తరుపున చేస్తామని తెలిపారు. అదేవిధంగా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు గారు మాట్లాడుతూ హెచ్.డి.పి.టి. ఆధ్వర్యంలో రానున్న ఉగాది పండుగ రోజున రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో పిల్లలకు సాముహిక అక్షరాభ్యాసాలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కనీసం దీపం కూడా వెలిగించని అనేక దేవాలయాలు ఉన్నాయని, వీటన్నింటిని గుర్తించి త్వరలోనే ఒక మంచి రోజున అన్ని దేవాలయాల్లో హెచ్.డి.పి.టి. ఆధ్వర్యంలో ప్రతీరోజు దీపం వెలిగించే పవిత్ర కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అర్చక యూనివర్సిటీని కూడా స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. దైవభక్తితోపాటు దేశభక్తిని కూడా ప్రతిఒక్కరు పెంపొందించుకోవాలని, ప్రతి గ్రామంలో బడి – గుడి నిలబెట్టుకుంటే ఆ గ్రామం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. రానున్న గోదావరి కృష్ణ పుష్కరాలను పురస్కరించుకొని ఇప్పటినుండే రాష్ట్రంలోని పవిత్ర పుణ్య నదులైన కృష్ణ, గోదావరి నదుల వెంట దేవతా వృక్షాలను నాటించేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి నాందిగా మొదట మార్చి 7 తేదీన ముఖ్యమంత్రి గారి సమక్షంలో కృష్ణానదిపై గల ప్రకాశం బ్యారేజీ నుండి హంసలదీవి వరకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవాలయాలను, అర్చకులను, హెచ్.డి.పి.టి. కోఆర్డినేటర్లు, ఆధ్యాత్మికవేత్తలు,

ప్రజాప్రతినిధులు, ధార్మిక పరిషత్తులు సంఘాల వారిని భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. కాగా ఈ కార్యక్రమానికి ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి గుండ్ల గంగమ్మ మరియు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ స్టేట్ కోఆర్డినేటర్లు సందిరెడ్డి కొండలరావు, కోట సునీల్ కుమార్ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆగమ పాఠశాల విద్యార్థులు, తదితర దేవస్థాన సిబ్బంది. పులువురు శివసేవకులు పాల్గొన్నారు.






## సభ్యత్వ నమోదులో నంద్యాల పార్లమెంటును ప్రథమ స్థానంలో నిలపాలి

**మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య**



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 27, నంది పత్రిక ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకోనివెల్లి జనసేన సభ్యత్వ నమోదులో నంద్యాల పార్లమెంటును ప్రథమ స్థానంలో నిలపాలని జనసేన పార్టీ నంద్యాల పార్లమెంటు పరిశీలకులు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తెలిపారు. శుక్రవారం ఆళ్ళగడ్డ పట్టణంలోని ఆవుల భాస్కర్ రెడ్డి ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గస్థాయి జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిన్నటి నుండి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని, కేవలం నిన్న ఒక్కరోజే లక్ష నూతన సభ్యత్వాలు నమోదు అయ్యాయని అన్నారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందనీ, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాల మేరకే పనిచేయాలని సూచించారు. ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ హై కమాండ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్తామనీ ఆయన తెలిపారు. అనంతరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య మాట్లాడుతూ 2014 నుండి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసి ఈ స్థాయిలో నిలబడడం జరిగిందన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ ఆశయ సాధనకు కట్టుబడి జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకట సుబ్బయ్య, దేవా ఆంజనేయులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో పాలడైరీపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 27, నందిపత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని బాలాజీ పాల డైరీనీ శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీంవలిలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డైరీలోని పాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ పాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాలడైరీలను తనికి చేయడం జరిగిందన్నారు. డైరీలలో సేకరించిన పాలను పరీక్షల నిమిత్తం చెన్నై ల్యాబ్ కి తరలించడం జరుగుతుందన్నారు. అక్కడి నుండి వచ్చిన పాల పరీక్షల నాణ్యత రిపోర్ట్ ను బట్టి తగిన చర్యలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న కన్నీటి సొమ్ము ఏమైంది?



**ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు నిలదీత!**

ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 27( నంది పత్రిక ) గత ఏడాది అకాల వడగళ్ల వానకు సర్వం కోల్పోయి కన్నీరు మున్నీరవుతున్న రైతన్నల నష్టపరిహారం నిధులు ఏమయ్యాయి? ఆ నిధులను ఏ విధంగా ఆపారు? ఎక్కడ దాచారు? దీనిపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలి" అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.ఆ డబ్బులు ఎటు పోయాయి?: వడగళ్ల వాన వల్ల పంటలు నాశనమై రైతులు వీధిన పడితే, ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. నిధులు విడుదలయ్యాయని, చెక్కుల రూపంలో ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి నేటికి ఏడాది గడుస్తున్నా.. ఆ డబ్బులు ఏమైపోయాయో ఎందుకు చెప్పడం లేదు? రైతన్న కన్నీటి సొమ్ముతో ఆదుకుంటారా?: ఆకాశం నుంచి పడ్డ వడగళ్లు రైతన్న నోటికాడి కూడును లాక్కుంటే, ఇప్పుడు ప్రభుత్వం వారు ప్రకటించిన పరిహారాన్ని ఆపి రైతుల పొట్ట కొడుతోంది. రైతు కన్నీరు పెడితే రాజ్యం చల్లగా ఉండదు.జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గారు, జిల్లా పరిపాలన అధికారిగా కలెక్టర్ రైతులకు జవాబు చెప్పాలి. ఆ నిధులు ఏ కారణంతో ఆగిపోయాయో, ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో స్పష్టమైన వివరణ ఇవ్వాలి. రైతన్నలారా, ఇది మన హక్కు.. ఎవరి భిక్ష కాదు. మన కళ్ల ముందే పంట నాశనమైతే ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. మన కన్నీటి సొమ్మును ఆపే హక్కు ఎవరికీ లేదు. మనకు రావలసిన పరిహారం మన చేతికి అందే వరకు ఈ పోరాటం ఆగదు రండి కదలి రండి అని రైతన్నలకు పిలుపునిచ్చారు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం నిధులపై తక్షణమే వివరణ ఇవ్వాలి. విడుదలైన నిధులు ఎక్కడ ఆగిపోయాయో వివరాలు బయటపెట్టి, వెంటనే ఆ చెక్కులను రైతులకు పంపిణీ చేయాలి. లేనిపక్షంలో ములుగు జిల్లా రైతాంగంతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు.



# ఆంధ్రా వర్సిటీకి పూర్వ వైభవం తేవాలి

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యతతోపాటు దాని పూర్వ వైభవాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ఏయూ ప్రాముఖ్యతను కాపాలన్నారు. సి.వి. రామన్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహానుభావుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని, యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో యూనివర్శిటీ రాజకీయ అడ్డాగా మారిందని, దీనివల్ల విద్యాసంస్థ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్శిటీలో రాజకీయ జోక్యం లేకుండా చేసి, విద్యా ప్రమాణాలను పునరుద్ధరించాలన్నారు. గత 18 ఏళ్లుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 93 మందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వీరిలో చాలామంది పదవీ విరమణకు దగ్గరగా ఉన్నందున, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ÷ఎమారు 400 నుంచి 500 మంది గెస్ట్ ఫ్యాకల్టీ కేవలం రూ.15 వేలకే పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఆర్థిక ఇబ్బందులను గమనించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకుని, ఏయూ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. యూనివర్శిటీ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో అక్షరజ్యోతి మీడియా క్యాలెండర్ ఘనావిష్కరణ







**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 : (నంది పత్రిక )** ములుగు జిల్లా కేంద్రంలో జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన అక్షరజ్యోతి మీడియా క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గారికి క్యాలెండర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు ఆధ్వర్యంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నగుండ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన అత్యంత ఘనంగా జరిగింది.

**ముఖ్య అతిథుల సందేశాలు:** ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మరియు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ, జాతీయ మానవ హక్కుల కమిటీ ప్రజా సమస్యల పరిష్కార దిశగా చేస్తున్న సేవలను అభినందించారు. కమిటీ సభ్యులు సమాజంలో చైతన్యం కల్పిస్తూ ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయడం ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు.

**కమిటీ లక్ష్యాలు మరియు కార్యాచరణ** జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు మాట్లాడుతూ, తమ సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం అని స్పష్టం చేశారు. ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, చట్టబద్ధమైన విధానాల ద్వారా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

నేషనల్ జనరల్ సెక్రటరీ మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నాయకత్వంలో సంస్థ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసిందని, తెలంగాణలో అన్ని జిల్లాలు మరియు మండల స్థాయిలో కమిటీలను విజయవంతంగా పూర్తి చేసిందని వివరించారు.

అక్షరజ్యోతి మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టబద్ధ అవగాహన పెంపు దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని వారు స్పష్టంచేసినారు.

**జిల్లా అధికారుల సేవలకు అభినందనలు** ములుగు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా అధికారులు చూపుతున్న చురుకుదనాన్ని కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తున్నదని, ప్రజలకు తక్షణ సహాయం అందుతున్నదని వారు పేర్కొన్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు** ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పోరిక రవీందర్, గోగులమూడి హరికృష్ణ, కుంట ఏడుకొండలు, సంజీవ, స్టేట్ సోషల్ మీడియా కో-కన్వీనర్ కోడిపాక రవి, జిల్లా ఉపాధ్యక్షులు గాదే శ్రీనివాసచారి, జిల్లా కమిటీ సభ్యులు లూర్ద్ రాజు, ములుగు పట్టణ అధ్యక్షురాలు ఉప్పుల కోమలతో పాటు మల్లంపల్లి, గోవిందరావుపేట, వాజేడు, వెంకటాపురం మండలాల అధ్యక్షులు గట్ల రవీందర్, కొండి రమేష్, సర్వేశ్వరరావు, రాయుడు జయరాజు, ములుగు మండల ఉపాధ్యక్షులు బుద్దే మల్లయ్య, వెంకటాపూర్ మండల ప్రధాన కార్యదర్శి వెలిసోజు లతా సాగర్, ములుగు మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, వాజేడు మండల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గురురాజ విద్యాసంస్థల వార్షికోత్సవానికి మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారికి ఆహ్వానం



**నంద్యాల సిటీ బ్యూరో ఫిబ్రవరి 27 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శ్రీ గురురాజ విద్యాసంస్థల 24వ వార్షికోత్సవం మరియు గోస్పాడు మండలం బాబానగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ గురురాజ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ గురురాజా విద్యాసంస్థల డైరెక్టర్ శావల్ రెడ్డి గారు ఈరోజు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారిని నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గురురాజా విద్యాసంస్థల డైరెక్టర్ శావల్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం (మార్చి 1, 2026) ఉదయం 09:30 గంటలకు గోస్పాడు మండలం, బాబానగర్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ గురురాజ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ వేడుకలు జరగనున్నాయిని . 24 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'ప్రవాహ' పేరుతో ఈ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు

## గోదావరి నది పుష్కర ఘాట్ ల ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలి.

**పుష్కర ఘాట్ లను పరిశీలించిన :: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 27( నంది పత్రిక )** ములుగు జిల్లా మంగపేట మండలం లో గోదావరి నది పుష్కర ఘాట్ ల ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటూరు నాగారం, మంగపేట మండలాలలోని చుంచుపల్లి , మల్లూరు, పోదుమూరు, రామన్నగూడెం, ముళ్ళ కట్ట పుష్కర ఘాట్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 2027 లో నిర్వహించనున్న గోదావరి నది పుష్కరాల సందర్భంగా ములుగు జిల్లాలోని ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలు, మరమ్మత్తు పనులు, భక్తుల కోసం ఏర్పాటు చేయవలసిన సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్ర ప్రతిపాదనలను సిద్ధం చేసి వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీ తీర ప్రాంతంలో పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా ప్రతి ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, రవాణా మార్గం, పార్కింగ్ స్థలాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, తహసిల్దార్ రవీందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యం రిజిస్ట్రేషన్ పై అవగాహన సదస్సు.

**జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ సిద్ధార్థ రెడ్డి.**



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27, ( నంది పత్రిక ):** ఉద్యం రిజిస్ట్రేషన్ పై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ సిద్ధార్థ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉద్యం రిజిస్ట్రేషన్ పై ప్రత్యేక అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ సిద్ధార్థ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగాలపై ఆసక్తి ఉన్న వారు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలను కునేవారు ఉద్యమం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ పై ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ రుణాలు పొందాలంటే ఉద్యం పోర్టల్ లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకుని ఉండాలని అన్నారు. సదస్సులో ఉద్యం రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యత, ఎలిజిబిలిటీ ప్రమాణాలు, ఆన్‌లైన్ అప్లై చేసే విధానం, లాభాలు (లోన్లు, సబ్సిడీలు, ప్రాధాన్యత టెండర్లు మొదలైనవి) గురించి వివరంగా వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా చిన్న వ్యాపారాలు ప్రభుత్వం నుంచి సమగ్ర సాయం పొందడం, బ్యాంకు లోన్లు, సబ్సిడీలు, టెండర్‌లలో ప్రాధాన్యత వంటి ప్రయోజనాల కోసం సరైన దశలో ఉద్యం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేలా సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఈ డి సి మేనేజర్ విక్రమ్, అసిస్టెంట్ మేనేజర్ భుక్య శ్రీకాంత్, రిసోర్స్ పర్సన్ వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ రామేందర్, మహిళా సంఘాల సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు



## సహకార రంగాన్ని బలోపేతం చేసే దిశగా విస్తృత చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 27 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సహకార శాఖలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల సొసైటీలు 671 ఉన్నాయని, వీటిలో 666 సొసైటీలను అప్డేట్ చేయడం జరిగిందన్నారు, మిగిలిన ఐదు సొసైటీలను వారం రోజుల్లోపుగా అప్డేట్ చేయాలని ఆదేశించారు. అలాగే సహకార శాఖకు సంబంధించి మొత్తం 122 పిఏసిఎస్ లను కంప్యూటర్ రైజేషన్ చేసి, 2024 - 25 సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్ ను పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాకు నాబార్డ్ మంజూరు చేసిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 24 మల్టీ పర్పస్ గోడౌన్స్ లో 14 పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 10 గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి పూర్తయిన 14 గోడౌన్లు వాడ్రా రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేసి, పిఏసిఎస్ లకు అప్పగించడం జరిగిందన్నారు. ఇప్పటికే పూర్తయిన గోడౌన్లను తక్షణమే వినియోగంలో తీసుకురావాలని ఆదేశించారు. కౌలు రైతులకు డిసిసిబి బ్యాంక్ విస్తృతంగా పంట రుణాలు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలను అత్యున్నత సంస్థలకు, గ్రామాలను, నగరాలకు, మండలాలను, ప్రపంచ మార్కెట్లకు, రాష్ట్ర డేటాబేస్‌లను, అంతర్జాతీయ డేటాబేస్‌లకు అనుసంధానించడంలో డేటాబేస్ ప్రధాన పాత్ర పోషిస్తుందని, తద్వారా సహకార సంస్థల విస్తరణను ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. సహకార సంస్థల ద్వారా భారతదేశంలో నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిని పెంచడంలో భారతీయ బీజ్ సహకార సమితి లిమిటెడ్ (బిబిఎస్ఎస్ఎల్) సహాయం చేస్తుందన్నారు. దీని వలన దిగుమతి చేసుకున్న విత్తనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తిని మెరుగుపరచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం అందించడం జరుగుతుందన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాలు రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రతి పంచాయతీ, గ్రామాన్ని కవర్ చేస్తూ 2 లక్షల కొత్త బహుళార్థసాధక పిఏసిఎస్ లు గా కానీ, లేదా ప్రాథమిక పాడి పరిశ్రమ, మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. నేషనల్ కోపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ లో సభ్యత్వం పొందడానికి జిల్లా నుండి 38 సొసైటీలు దరఖాస్తు చేసుకోగా, 12 సొసైటీలు మెంబర్ షిప్ ను అందుకోవడం జరిగిందన్నారు. అలాగే బి బి ఎస్ ఎస్ ఎల్ లో 121 సొసైటీలు సభ్యత్వం సభ్యత్వం పొందడం జరిగిందని, ఎన్సీఈఎల్ లో 22 సొసైటీలు సభ్యత్వం పొందాయని తెలిపారు. దీని ద్వారా మన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో ఆదాయాన్ని పెంచుకోవడానికి వీలవుతుంది అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం కౌలు రైతుల రుణాల మంజూరులో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా 159 కౌలు రైతులకు సొసైటీలో చేర్పించి రూ.18.49 లక్షల పంటల రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ ఎడి కేఏఎస్ఎస్ శ్రీనివాస్, మత్స్య శాఖ జెడి ఆర్.కోటి లింగరాజు, నాబార్డ్ డీడియం నిష్యంత్, డిసిసిబి సీఈవో పి.సింహాచలం, ఎఫ్సీఐ అధికారి పి.ఆనంద్, సెంట్రల్ వేర్ హౌసింగ్ అధికారి పి.వేణు, ఆప్కాబ్ డిపిడిఎం, మార్కెటింగ్ శాఖ డిఈ సిహెచ్ సాయి రామారావు, డీఎస్ఓ సరోజ, ఎఫ్సీఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .



## కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమ పథకాలు.

**మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే ప్రభుత్వ ధ్యేయం.**

**ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మన్యం సునీల్ బాబు.**



**వెంకటాపురం నూగూరు ఫిబ్రవరి 27 : నంది పత్రిక /** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమ పథకాలని, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యే య మని, అర్హులైన ప్రతి పేదవారికి, సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని, అదే ప్రభుత్వ లక్ష్యం మని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మన్యం సునీల్ బాబు అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం మరికాల పంచాయతీ గ్రామం, డబల్ బెడ్ రూమ్ కాలనీలో శుక్రవారం సిమెంట్ రోడ్ నిర్మాణ పనులకు గ్రామపంచాయతీ సర్పంచ్ కుర్సం కన్నయ్య, బెస్త గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మడే భీమేశ్వరి లు కొబ్బరికాయలు కొట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, ప్రముఖ రైతు మన్యం సునీల్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ నిధుల లభ్యతను బట్టి గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కి కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యే చొరవతో మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి సంక్షేమ పథకాలకు, కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నారని, వారిని అభినందించారు. పంచాయతీల వారీగా నిధుల లభ్యతను బట్టి, ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సిమెంటు రోడ్లను, నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ సందర్భంగా కోరారు. . ఈ కార్యక్రమంలో మరికాల జిపి కార్యదర్శి రమేష్,ఉప సర్పంచ్ బి.రామ్ ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం.సునీల్ బాబు, రమేష్ బాబు గ్రామస్తులు, నాయకులు, డబల్ బెడ్ రూమ్ నివాసితులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ క్లైంట్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆధార్ సేవలు సులభం

**మంగపేట , ఏటూరునాగారం తాడ్వాయి మండలాలలో మీసేవ ఆధార్ సెంటర్ల తనిఖీలు.**

**రెండు నిమిషాల్లో కుల ధృవీకరణ పత్రం మంజూరు ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**




**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27, ( నంది పత్రిక):** మీసేవ లో నాన్ క్రీమీ లేయర్ సర్టిఫికెట్ తప్పులు లేకుండా నమోదు చేయాలి,మీసేవ లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ సర్వీసు ను రైతులందరూ వినియోగించు కోవాలి,నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవు,యూనివర్సల్ క్లైంట్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆధార్ సేవలు మరింత సులభ తరం, మంగపేట, ఏటూర్ నాగారం మరియు తాడువాయి మండలం లోని పలు మీసేవ కేంద్రాలను ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, మీసేవ మేనేజర్లు విజయ్ మరియు రాకేష్ లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం ప్రజలకు మీసేవ ద్వారా రెండు నిమిషాల వ్యవధిలోనే కుల దృవీకరణ పత్రం అందజేయబడుతుంది. అలాగే టి జి పి ఎస్ సి పోర్టల్ లో ఓ టి ఆర్ అప్డేట్ చేసుకొనుటకు నాన్ క్రీమీ లేయర్ సర్టిఫికెట్ నమోదు చేయడంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. కొత్తగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ సర్వీస్ గురించి మీసేవ నిర్వాహకులకు వివరించారు. ఏ విధమైన టెక్నికల్ సమస్యలు వచ్చిన అతి త్వరగా క్లియర్ చేస్తామని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ప్రతి అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు. మీసేవ కేంద్రాలను ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ఈ ఎస్ డి గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చార్టర్ , భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో మరియు తాహాసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఆదేశించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్వీస్ లను ప్రజలకు అందించాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ & రాకేష్ మరియు మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆదివాసులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలకు తూట్లు

**గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలు అమలు చేయాలని మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈసం యాదయ్యడిమాండ్**

**ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 27( నంది పత్రిక ):** ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి గిరిజన చట్టాలకు విరుద్ధంగా పనిచేస్తున్నది ఆదివాసి ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రభుత్వాలు ప్రభుత్వ అధికారులు గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని మన్యసీమ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈసం యాదయ్య ఆరోపించారు మంగపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా వ్యతిరేకంగా పలు గ్రామాలలో ఎల్ టి ఆర్ 1ఆఫ్59,1ఆఫ్70 పెసా, చట్టాలకు విరుద్ధంగా భూములు క్రయ విక్రయాలు అనుమతి లేని ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ లేని అక్రమ భవన నిర్మాణాలు చేపడుతున్నారు రెవెన్యూ పంచాయతీ అధికారులు సోద్యం చూస్తున్నారని మండిపడ్డారు షెడ్యూల్ ప్రాంతంలో 1/59,1/70,పెసా, ఎల్టిఆర్, చట్టాలను పాతరేస్తూ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు

గిరిజనేతర్లతో కుమ్మక్కై రాజకీయ అండతో పైసలు పలుకుబడితో ఆదివాసులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలను తూట్లు పోడుస్తూ గిరిజన చట్టాలను ఆంక్షలు సైతం అటుకెక్కిస్తూ ఆదివాసులను ఆదివాసి ప్రాంతాలను విచ్ఛిన్నం చేస్తూ ఏజెన్సీ ప్రాంత సంపదను గిరిజనేతరులకు దోచి పెడుతూ కట్ట పెడుతున్నది గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు ఎంపీలు అని ఆరోపించారు ఏజెన్సీ ప్రాంతంలో ఏ ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ముందుగా ఆదివాసి గిరిజనులకు ఇవ్వాలని అదేవిధంగా అభివృద్ధి పనులు ఆదివాసి గిరిజన గుడెలను గ్రామాలను అభివృద్ధి చేయాలి కానీ ఈ ప్రాంత చట్టాలకు జీవొలకు వ్యతిరేకంగా విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు మొత్తం గిరిజన ప్రాంతాలకు విరుద్ధంగా పనిచేస్తుందని తక్షణమే ఆదివాసులపై ఆదివాసి ప్రాంతాలపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసి గుడెలు, గ్రామాలలో అభివృద్ధి పనులు మౌలిక వసతులు కల్పించాలని లేనియెడల ప్రజా ఉద్యమంగా మలిచి ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరిస్తూన మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ సం యాదయ్య, మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com